

మెదక్ సంగారెడ్డి సిద్దిపేట



1

నవతెలంగాణ

శనివారం 26 ఆగస్టు 2023

సీఎం ఇలాకలో ఎస్సైల కరువు

నవ తెలంగాణ-మద్దూరు

సీఎం కేసీఆర్ సొంత జిల్లాలో ఎస్సైల కరువు నెలకొంది. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై లేక నెల రోజులు కావస్తున్నా ఇప్పటివరకు ఉన్నతాధికారులు ఎస్సై పోస్టును భర్తీ చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్దూరు, దూల్మిట్ట రెండు మండలాలకు మద్దూరు ఒకటే పోలీస్ స్టేషన్ కావడంతో ఎస్సై లేకపోవడంతో వరుస దొంగతనాలు జోరుగా జరుగుతున్నాయి. సీఎం సొంత జిల్లాలో ఉన్నతాధికారులు ఎస్సైని కేటాయించకపోవడం విడ్డూరంగా ఉందని పేర్కొంటున్నారు. మద్దూరు, దూల్మిట్ట మండలంపై జిల్లా పోలీస్ అధికారులు చిన్నచూపు చూస్తున్నారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో గ్రామాలలో ఎన్నికల వేడి వాతావరణం జోరుగా సాగుతోంది. ఎన్నికలు సమీపిస్తుండడంతో గ్రామాలలో ఘర్షణ వాతావరణం నెలకొనే ఆస్కారం ఉంది. ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి మద్దూరు, దూల్మిట్ట మండలాలకు గల పోలీస్‌స్టేషన్ లో ఎస్సైని వెంటనే నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బీసీవాదం ఫలించేనా?

'మేమెంతో మాకంత. ఓట్లు మావి సీట్లు మీవా' ఇదీ..! బహుజనుల నినాదం. ఎన్నికలొచ్చినప్పుడల్లా బీసీలకు సామాజిక న్యాయం జరగాలంటే సగం సీట్లు కేటాయించాలనే డిమాండ్ ముందుకొస్తోంది. రాజకీయాల్లో బీసీలు సైతం తమ ప్రాతినిధ్యం కావాలని కొట్లాడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల వేళ ఏయే పార్టీలు బీసీలకు సముచిత స్థానం ఇస్తారనేది చర్చనీయాంశమైంది. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థుల్ని ప్రకటించింది. కాంగ్రెస్, బీజేపీ సైతం అభ్యర్థుల జాబితాపై కసరత్తు చేస్తున్నాయి. పాలక పార్టీల్లో ఎంత మందికి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం వస్తుందో వేచిచూడాలి.

- బీఆర్ఎస్‌లో చింతకు టికెట్
- డజన్ మందికిపైనే నిరాశ
- కాంగ్రెస్‌లో ఆశావహులు అధికమే
- బీజేపీలోనూ టికెట్ రేస్‌లో అరడజన్ మంది
- బీ ఫామ్ ఇస్తేనే బీసీలకు భరోసా
- టికెట్ల కేటాయింపులో సామాజిక న్యాయం జరగాలనే డిమాండ్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలో టికెట్ ఆశిస్తున్న బీసీ నాయకులకు కొదవలేదు. సగం రిజర్వుడ్ నియోజకవర్గాలు మినహా 8 చోట్ల కూడా బీసీలు టికెట్ల ఆశిస్తున్నారు. జహీరాబాద్, అందోల్ నియోజకవర్గాలు ఎస్సీలకు రిజర్వుడ్ చేయబడ్డాయి. అవి మినహా పటాన్‌చెరు, సంగారెడ్డి, నర్సాపూర్, మెదక్, నారాయణఖేడ్, గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాకలోనూ బీసీలు టికెట్ల కోసం ప్రయత్నిస్తున్నారు. కొందరు గత ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీలుగా కూడా పోటీ చేసిన వాళ్ల తిరిగి టికెట్ల కోసం పట్టుపడుతున్నారు. పది నియోజకవర్గాలకు గాను రెండు రిజర్వుడ్ స్థానాల్లో మినహా మిగతా ఎనిమిది చోట్ల కూడా ఓసీలే ఎమ్మెల్యేలుగా ఉన్నారు. రెడ్డి సామాజిక వర్గం నుంచి ఐదుగురు, వెలమ సామాజిక వర్గం నుంచి ముగ్గురు చొప్పున అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీసీలకు చట్ట సభల్లో 50 శాతం ప్రాతినిధ్యం ఉండాలనే డిమాండ్ బలంగా ఉన్నందున వచ్చే ఎన్నికల్లో పార్టీ బీసీలకు టికెట్లు ఇస్తుందో చూడాలి. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థుల్ని ప్రకటించిన జాబితాలో ఒకరు బీసీకి చోటు లభించింది.

బీఆర్ఎస్‌లో చింతకు ఛాన్స్

బీఆర్ఎస్‌లో చాలా మంది బీసీలు టికెట్లు ఆశించారు. అందు కోసం నాలుగేళ్ల పాటు సేవా కార్యక్రమాలు, పార్టీ కార్యక్రమాల ద్వారా గ్రౌండ్ వర్క్ చేశారు. తీరా కేసీఆర్ ప్రకటించిన జాబితాలో సంగారెడ్డి నుంచి చింత ప్రభాకర్‌కు అవకాశం దొరికింది. చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఉన్న ఆయనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా కూడా అవకాశం రావడంతో ఆ సామాజిక వర్గం హర్షం వ్యక్తం చేసింది. అయితే మిగతా బీసీ కులాలకు తగిన సముచిత స్థానం లభించలేదనే విమర్శ ఉంది. ముఖ్యంగా పార్టీ కోసం కష్టపడి ప్రజల్లో పలుకుబడి ఉన్న నాయకుల్ని సైతం పక్కన ప ఎట్టారనే చర్చ నడుస్తోంది. పటాన్‌చెరు నుంచి ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి నీలం మధు టికెట్ కోసం ప్రయత్నించారు. సర్పంచ్‌గా ముదిరాజ్ సంఘం నాయకుడిగా అనేక సేవా కార్యక్రమాలు చేశారు. నియోజకవర్గంలో 70 వేల వరకు ముదిరాజ్‌ల ఓట్లు ఉన్నాయని చెబుతున్నారు. సంగారెడ్డిలోనూ పట్నం మాణిక్యం, పులిమామిడి రాజు సైతం ముదిరాజ్ కోటా టికెట్ కోసం ప్రయత్నించారు. జహీరాబాద్, అందోల్, సంగారెడ్డి నియోజకవర్గాల్లో లింగాయత్‌లు బలంగా ఉన్నందున టికెట్ ఇవ్వాలని ఆత్మకూర్ నగేష్ ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. నారాయణఖేడ్ నుంచి పెద్ద శంకరంపేట జెడ్పీటీసీ శ్రీనివాస్ గౌడ్ కూడా బీసీ కోటాలో టికెట్ ఆశించినా రాలేదు. మెదక్‌లో నిజాంపేట జెడ్పీటీసీ రమేష్ గౌడ్, నర్సాపూర్‌లో శివంపేట జెడ్పీటీసీ కూడా టికెట్ ఆశించారు.

కాంగ్రెస్‌లో ఎవరికొచ్చేనో..?

కాంగ్రెస్‌లోనూ బీసీలు టికెట్ రేసులో ఉన్నారు. పటాన్‌చెరు నుంచి కాట శ్రీనివాస్ 2018 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. తిరిగి పోటీ చేసేందుకు సిద్ధమై దరఖాస్తు చేసుకున్నారు. మళ్లీ ఆయనకే టికెట్ వస్తుందన్న చర్చ ఉన్నా బీ-ఫామ్ ఇచ్చాకే భరోసా వచ్చేది. గాలి అనిల్‌కుమార్ కూడా బీసీ కోటా నర్సాపూర్, పటాన్‌చెరు టికెట్లు ఆశిస్తున్నారు. గాలి అనిల్‌కుమార్ 2019 ఎన్నికల్లో మెదక్ ఎంపీగా కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ బరిలోనే ఉంటానని చెబుతున్నారు. నారాయణఖేడ్ నుంచి సంజీవరెడ్డి టికెట్ రేసులో ఉన్నారు. ఆయన జనరల్ క్యాటగిరి కింద కాకుండా కర్ణాటకలో ఉన్న సామాజిక విభజన ప్రకారం తనను బీసీగా గుర్తించి టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. దుబ్బాక నుంచి కత్తి కార్తిక కూడా టికెట్ ఆశిస్తున్నారు. గత ఎన్నికల్లో ప్రయత్నించి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ సారి కాంగ్రెస్ నుంచి పోటీ చేయాలని సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

బీజేపీలోనూ టికెట్ల కోసం ప్రయత్నం

బీజేపీలోనూ పలువురు బీసీలు టికట్ రేసులో ఉన్నారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు ఈటెల రాజేందర్ గజ్వేల్ నుంచి పోటీ చేయాలని అధిష్టానం చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. సంగారెడ్డి నుంచి శివరాజ్‌పాటిల్, పటాన్‌చెరులో నందీశ్వర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, నారాయణఖేడ్‌లో సంగప్ప, నర్సాపూర్‌లో మురళీధర్‌యాదవ్, మెదక్ నుంచి తాళ్లపల్లి రాజశేఖర్, బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన నిజాంపేట జెడ్పీటీసీ పంజ విజయకుమార్ టికెట్ ఆశిస్తున్నారు. వీరిలో ఎవరికి టికెట్ వస్తాయో రావో అనేది ఆ పార్టీ అభ్యర్థుల్ని ప్రకటించే వరకు వేచి చూడాలి.

సిద్దిపేట త్రీ టౌన్ పీఎస్‌కు శాశ్వత భవనం

- నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి హరీశ్‌రావు



నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు శాశ్వత భవనం మంజూరైంది. ఈ నెల 26న మంత్రి హరీశ్‌రావు రంగదాంపల్లి పరిధిలో కేటాయించిన స్థలంలో పీఎస్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ కోస సిద్దిపేట పరిధి లో పెరిగిన జనాభా దృష్ట్యా సిద్దిపేట కు 3 టౌన్ పోలీస్ స్టేషన్ మంజూరు కాగా గత రెండు సంవత్సరాల నుండి తాత్కాలిక భవనం లో కార్యాకలపాలు నిర్వహిస్తున్నారు. కాగా శాశ్వత భవనంకు రూ. 4.44 కోట్లు మంజూరు కాగా అన్ని వసతులతో సకల హంగులతో మోడల్ గా శాశ్వత భవనం నిర్మాణం చేపట్టనున్నారు.

చేవెళ్ల ప్రజా గర్జనను విజయవంతం చేయండి

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



నవతెలంగాణ- గజ్వేల్

చేవెళ్ల ప్రజా గర్జనను విజయవంతం చేయాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో దగా పడిన దళిత గిరిజనులారా కేసీఆర్ మాటలు నమ్మొద్దని ఆయన అన్నారు. మోసపూరిత ప్రభుత్వాన్ని గద్దె దించడమే కాంగ్రెస్ లక్ష్యమని ఆయన అన్నారు. శనివారం మేడ్చల్ పట్టణంలో కె.వి.ఆర్ గార్డెన్ లో చేవెళ్ల ప్రజా గర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమని ఆయన చెప్పారు. గజ్వేల్ నియోజకవర్గం నుండి భారీ ఎత్తున కార్యకర్తలు నాయకులు పార్టీ అభిమానులు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. డిసెంబర్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తాము నిర్వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం లో ఇంటింటి కాంగ్రెసులో ప్రజల తన బాధలు చెప్పుకుంటున్నారని ఆయన చెప్పారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ , పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి, పార్టీ పెద్దలు సూచించిన విధంగా పార్టీ బలోపేతం చేస్తున్నామని ఆయన చెప్పారు. చేవెళ్ల ప్రజాగర్జనలో దళిత డిక్లరేషన్ ప్రకటిస్తామన్నారు.

పాఠశాలకు ప్రొజెక్టర్ అందజేత



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని వింజపల్లి గ్రామ పరిధిలో గల పెరుకలగడ్డ ప్రాథమిక పాఠశాలకు అన్నాడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన తల్లిదండ్రులు గంగిరెడ్డి రాజవ్వల జ్ఞాపకార్థం ప్రొజెక్టర్‌ను అందించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పాఠశాల ఉపయోగార్థం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాలలో అందిస్తున్న సాంకేతిక విద్య ద్వారా మరింత ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రవివర్మ, మనీందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, జీవన్‌రెడ్డి, చైర్మన్ రత్నాకర్, రాజలింగం, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

లర్నింగ్ లైసెన్సుల పంపిణీ



నవతెలంగాణ దుబ్బాక రూరల్

మెదక్ ఎంపీ, బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక నియోజకవర్గ బీ ఆర్ఎస్ పార్టీ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డితోనే దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేపూరి శేఖర్ గౌడ్, పెద్దగుండెల్లి గ్రామ శాఖ అధ్యక్షులు మాల్లుగారి ప్రేమ్ కుమార్ అన్నారు. శుక్రవారం నూతన అక్బర్ పేట్ భూంపల్లి మండలానికి చెందిన పోతారెడ్డిపేట్ గ్రామస్తులతో పాటు ,దుబ్బాక మండలానికి చెందిన ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తు చేసుకున్న 214 మందికి లర్నింగ్ లైసెన్స్ పత్రాలను సిద్దిపేట ఆర్టీఏ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ ఎంపీ రోడ్డు ప్రమాద నివారణకు యువతకు లైసెన్స్‌లు అందిస్తామని చెప్పడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ ఈర్షద్ హుస్సేన్, తొగుట మండల అధ్యక్షులు నంట పరమేశ్వర్ రెడ్డి, ఆకారం గ్రామ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు మర్కంటి నవీన్, దుబ్బాక మండలం బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు గంట అజయ్ కుమార్ ఉన్నారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాని వినతి



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల రెవిన్యూ డివిజన్ ఏర్పాటు కోసం కృషి చేయాలని కోరుతూ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన పలువురు నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందిస్తూ ఎన్నికల ముందే రెవెన్యూ డివిజన్ ప్రకటన వస్తుందని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో పొన్నం వెంకటేష్ గౌడ్, పచ్చిమడ్ల మానస, చంద శ్రీకాంత్, కూరపాటి నర్సింహులు ఉన్నారు.

గురుకుల ప్రిన్సిపాల్ సాయిరెడ్డిని సస్పెండ్ చేయాలి



నవతెలంగాణ -నారాయణఖేడ్‌రూరల్

మూడుగుంటల్ శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సరిపడ అన్నం పెట్టకుండా ప్రిన్సిపాల్ సాయిరెడ్డి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని.. అలాగే విద్యార్థులను కులం పేరుతో దూషిస్తుడని.. వెంటనే ఆయన్ను సస్పెండ్ చేయాలని విద్యార్థులు పాఠశాల ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. వారికి ప్రజాసంఘాల, విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపి.. నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాస్మోటిక్ ఛార్జీల్లో రూ.150 చొప్పున 600 మంది విద్యార్థుల దగ్గర వసూలు చేసి అవినీతికి పాల్పడ్డారన్నారు. ఈ విషయమై విద్యార్థులు ప్రశ్నిస్తే.. కులం పేరుతో ప్రిన్సిపాల్, ప్రిన్సిపల్ బినామీ టీచర్ మైపాల్ రెడ్డి విద్యార్థులను దూషిస్తున్నారు.. నలుగురు విద్యార్థులను సైతం సస్పెండ్ చేశారన్నారు. మాల, మాదిగలకు, లంబడాలను ఈ పాఠశాలలో ఉండనీయమంటూ ప్రిన్సిపాల్ సాయి రెడ్డి, ఉపాధ్యాయులు మైపాల్ ఒడ్డి, బాగా తాగిరెడ్డి ఇష్టారీతిన మాట్లాడుతున్నార న్నారు. ఈ విషయాన్ని ఆర్సీఓ దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందని.. అందుకే నేడు పాఠశాల ఆవరణలో నిరసన తెలిపాల్సి వచ్చిందన్నారు. అనంతరం డీఎస్పీని కలిసి వాళ్లపైన చర్య తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కులవ్యక్ష వ్యతిరేక పోరాట జిల్లా ఉపాధ్యక్షులు కోటారి నర్సింలు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, కుమార్ ఏఐఎస్ఐ జిల్లా నాయకులు కుమార్, అశోక్, డీఎస్పీ జిల్లా నాయకులు జీవన్, సీఐటీయూ జిల్లా నాయకులు చిరంజీవి, సీపీఐ అనంద్, అరవింద్, విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు బంగార్‌రాజ్, సంజవులు, నర్సింలు, శంకర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు కుర్చీల పంపిణీ



నవ తెలంగాణ దౌల్తాబాద్

మానవత్వాన్ని చాటిన మండల సోషల్ మీడియా అధ్యక్షులు ముతోల్ల స్వామి జన్మదిన సందర్భంగా శుక్రవారం తన సొంత ఖర్చుల తో అంగన్వాడీ చిన్నపిల్లలు కూర్చోవడానికి కుర్చీలు పంపిణీ చేయడం సంతోషకరమని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రణం శ్రీనివాస్ గౌడు అన్నారు. చిన్నతనం నుండి సేవా కార్యక్రమాలు చేపట్టడం మంచి ఆలోచన అన్నారు. స్వామి ఇలాంటి సేవా కార్యక్రమాలు ముందు ,ముందు మరెన్నో చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయురాలు సీనియర్ నాయకులు పట్నం శెట్టి శేఖర్ అప్ప గొడుగుపల్లి గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గని రాజు, యువజన కార్యదర్శి వంగ సాయి కుమార్ గౌడ్, గ్రామ యూత్ ఉపాధ్యక్షుడు మలని రాజు సుమన్, అనిల్ పాల్గొన్నారు.

త్వరలో ఐఓసీ కార్యాలయం ప్రారంభం

నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ సమీకృత కార్యాలయ సముదాయం (ఐఓసి) అతి త్వరలో ప్రారంభం కానుందని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లో సుమారు మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో 17 కోట్ల నిర్మాణ వ్యయంతో అత్యంత అధునాతన పద్ధతిలో నిర్మాణం జరుగుతున్న ఐఓసీ నిర్మాణ పనులను ఆర్డీఓ బెన్ శాలేంతో కలిసి జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండాలని దృఢ సంకల్పంతో చేపట్టారని అన్నారు. ప్రజలకు ఒకే చోట అన్ని కార్యాలయాలతో సులభతరమైన సౌకర్యం అందించవచ్చునని పేర్కొన్నారు. అందులో భాగంగానే హుస్నాబాద్ ఐఓసీ పనులు దాదాపు పూర్తి కావచ్చాయన్నారు. హుస్నాబాద్ డివిజన్లో ఉన్న ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఇంజనీరింగ్ కార్యాలయాలు ఆర్ అండ్ బీ-పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ, ఆటవి రేంజ్ కార్యాలయం, ఎస్టిఓ కార్యాలయం తదితర అన్ని కార్యాలయాలు సిద్ధం చేస్తున్నాం. అలాగే టాయిలెట్స్, డ్రింకింగ్ వాటర్, పార్కింగ్ అన్ని సదుపాయాలు ఒక కార్పొరేట్ స్థాయిలో కార్యాలయాలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఐఓసీలో ఏర్పాటు చేసిన కార్యాలయాలు సిబ్బందితో సహా ఫైల్స్ ఇతరతర సామగ్రి త్వరగా ఐఓసీకి షిఫ్ట్ చేసి ఐఓసి ప్రారంభంకి ప్రజలకు సేవలు అందించేందుకు అన్ని విధాల సిద్ధం కావాలన్నారు. ఫర్నిచర్ మాత్రం ప్రతి కార్యాలయానికి అందిస్తామని, కార్యాలయంకు కావాల్సిన ఎలక్ట్రిసిటీ, వాటర్ ఫెసిలిటీ, మంచి రోడ్డు సౌకర్యం లైటింగ్ అన్ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నాం అన్నారు. జనగాం రోడ్డు ని నుండి ఆఫీస్ కాంప్లెక్స్ వరకు బటర్ఫ్లై లైట్స్ పెట్టేందుకు ఏర్పాటు, పక్కనే ఉన్న పాలిటెక్నిక్ కాలేజ్ కి కూడా ఎలాంటి ఇబ్బంది కలగకుండా భవిష్యత్తులో ఐఓసీ పాలిటెక్నిక్ కాలేజ్‌ల వల్ల మంచి ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో డిటిఓ బాలరాజు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, ఏజెన్సీ కాంట్రాక్టర్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధిపై పొన్నం ప్రభాకర్‌కు అవగాహన లేదు

- రాజకీయ పబ్బం కోసం విమర్శలు
- హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన అభివృద్ధిపై మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అవగాహన లేకుండా మాట్లాడడం రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసమేనని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ మండిపడ్డారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధి చెందలేదు అనడం పొన్నం దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు.పొన్నం ప్రభాకర్ కరీంనగర్ ఎంపీగా ఉన్నప్పుడు ఎన్ని నిధులు తెచ్చావని, నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏంటో తెలపాలని సవాల్ విసిరారు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికి నోటికి ఏది వస్తే అది మాట్లాడితే ప్రజలు విశ్వసించే రోజులు పోయాయని అన్నారు. గతంలో కల్లబొల్లి కబుర్లు చెప్పి కాంగ్రెస్ నాయకులు తమ పబ్బం గడుపుకున్నారే కానీ హుస్నాబాద్ అభివృద్ధి గురించి ఏ కోశానా ఆలోచించలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పటి నుండి సీఎం కేసీఆర్ నాయకత్వంలో హుస్నాబాద్ నియోజకవర్గానికి చాలా నిధులు తెచ్చి అభివృద్ధి చేశానని చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తూ రాష్ట్రంలోనే ప్రత్యేకంగా నిలబెడుతున్నానని అవి చూసి ఓర్వలేని తనంతో ఇలాంటి దిగజారుడు మాటలు మాట్లాడడం వారి వివేకానికి వదిలేస్తున్నానన్నారు. తెలంగాణ గురించి పార్లమెంటులో కొట్లాడిన వ్యక్తిగా వ్యక్తిగతంగా పొన్నం ప్రభాకర్ అంటే గౌరవం ఉందని ఇలాంటి చిల్లర మాటలు మాట్లాడి అతని వ్యక్తిత్వాన్ని దిగజార్చుకోవద్దని హితవు పలికారు.

స్థానికులకే జహీరాబాద్ కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలి

స్థానికేతరులకు టికెట్ ఇస్తే తిరగబడతామంటున్న కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ జహీరాబాద్

జహీరాబాద్ శాసనసభ కాంగ్రెస్ పార్టీ టికెట్టు స్థానిక దళిత నాయకులకే ఇవ్వాలని ఉద్యమం ప్రారంభమైంది. ఇప్పటికే మండలాలవారీగా నాయకులు తీర్మానాలు చేసి కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి అందజేసినట్లు తెలిసింది. జహీరాబాద్, న్యాల్కల్, ఝరాసంగం మండలాలలోని దళిత నాయకులు తాము సంవత్సరాల తరబడి పార్టీకి అంకితమై వివిధ కార్యక్రమాలను చేపడుతూ వస్తున్నామని, ఈసారి ఎమ్మెల్యే టికెటు స్థానిక దళిత నాయకులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే మండలాలవారీగా సమావేశాలు నిర్వహించి తీర్మాన పత్రాలను కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి పంపినట్లు నాయకులు పేర్కొంటున్నారు. స్థానికుల్లో ఎవరికి టికెట్ ఇచ్చినా తామంతా కలిసి గెలిపించే బాధ్యత తీసుకుంటామని తీర్మాన పత్రంలో పేర్కొన్నారు. మాజీ మంత్రి డాక్టర్ జె గీతారెడ్డి కూతురు మేఘనారెడ్డి జహీరాబాద్ నుంచి శాసనసభకు పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. జహీరాబాద్ స్థానిక నాయకులు కే నర్సింలు, ప్రముఖ న్యాయవాదులు బి గోపాల్, నేతానియల్, నరేష్‌తో పాటు ప్రముఖ వ్యాపారవేత్తలు, సీనియర్ నాయకులు టికెట్ ఆశిస్తున్నారు. జహీరాబాద్ టికెట్ ఆశిస్తున్న మాజీ మంత్రి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చంద్రశేఖర్ బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. జహీరాబాద్ టికెట్ కె.చంద్రశేఖర్‌కే ఇస్తారన్న ప్రచారం జరగడంతో స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు మనస్థాపానికి గురై వివిధ పార్టీల్లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తుంది. మాజీ డీసీసీబీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయన బాటలోనే మరికొందరు కొనసాగుతారన్న వార్తలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో మైనారిటీలు, దళితులు అధికంగా ఉన్నందున ఈ రెండు వర్గాలకు చెందిన ప్రథమ, ద్వితీయ అగ్రస్థాయి నాయకులను ఆకర్షించేందుకు వివిధ పార్టీలో తహతహలాడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలో మేల్కొన్న ముసలం ఎప్పటివరకు కొనసాగుతుంది. ఏ స్థాయికి దారి తీస్తుందని గ్రామీణస్థాయి కార్యకర్తలు ఆలోచనలో పడ్డారు.

అయోమయంలో కార్యకర్తలు

జహీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి కిందిస్థాయిలో బలమైన కార్యకర్తల ఓటు బ్యాంకు ఉంది. శాసనసభ ఎన్నికల అనంతరం జరిగిన ఎంపీటీసీ, సర్పంచ్, ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. కోహీర్, జహీరాబాద్, ఝరాసంగం, మొగుడంపల్లి మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. నియోజకవర్గంలో మెజారిటీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీకి చెందినవారే ఉన్నారు. ఆది నాయకత్వంలో క్రమశిక్షణ లోపించడంతో రెండుగా చీలారు. కాంగ్రెస్ పార్టీ ఒకవర్గం ఇప్పటికే బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకుంది. మిగిలిన కిందిస్థాయి కార్యకర్తలు తమ అవసరాల రీత్యా అధికార పార్టీకి చెందిన నాయకుల వద్దకు వెళ్లాల్సి వస్తోందని తెలుస్తోంది. తమను ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఏ విధంగా పరిష్కరిస్తుందో వేచి చూడాలి మరి..

సీఎం కేసీఆర్ పచ్చి అవకాశవాది

- బీఆర్ఎస్‌ను ఓడించి తీరుతాం
- సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



నవతెలంగాణ కొమురవెల్లి

సీఎం కేసీఆర్ పచ్చి అవకాశ వాది. బీఆర్ఎస్‌ను ఓడించి తీరుతాం' అని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం కొమురవెల్లి సీపీఐ(ఎం) కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అవకాశవాద రాజకీయాలు చేస్తున్నాడన్నారు. వామపక్షాల ఆధ్వర్యంలో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించి తీరుతామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అవసరానికో అబద్ధం ఆడుతూ రాజకీయ పబ్బం గడుపుతున్నాడని తెలిపారు. సీఎం రాజకీయాలను రాష్ట్ర ప్రజలు పూర్తిగా గమనిస్తున్నారన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో వామపక్షాల మద్దతుతో బీజేపీపై కుస్తీ పట్టి గెలిచి, ఇప్పుడు గెలవడానికి బీజేపీతో దోస్తీ చేస్తున్నాడని ఆరోపించారు. తొమ్మిదేండ్ల కేసీఆర్ పాలనలో పేదల బతుకులు మారలేదన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు ఇవ్వాలన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఎం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అనేకసార్లు ధైర్యంగా నిలదీసిందని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం క్షేత్రస్థాయిలో పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. తెలంగాణ ప్రజల సంపదను అత్యధికంగా దోచుకున్నది కేసీఆర్ ప్రభుత్వం, వాళ్ల ఎమ్మెల్యేలే అని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించి తీరుతామని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కిష్టారెడ్డి, నాయకులు రాళ్ల బండి నాగరాజు, సార్ల యాదయ్య, ఆరుట్ల దయానంద్, చెరుకు వెంకటరెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలి







నవతెలంగాణ-సంగారెడ్డి

సెప్టెంబర్ 8, 9,10 తేదీల్లో సంగారెడ్డిలో జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు జయప్రదం చేయాలని సంగారెడ్డి జిల్లా కేంద్రంలో గల సాయి ఐటిఐ, ప్రభుత్వ ఐటిఐ, ప్రభుత్వ గర్ల్స్, బాయ్స్ జూనియర్ కళాశాలలో శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లకు ముఖ్య వక్తలుగా మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు కే. రాజయ్య ఏ. మాణిక్యం, మద్దూరి లక్ష్మీ హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం రద్దు చేసే వరకు పోరాటం చేయాలన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మహిళల పైన జరుగుతున్న దాడులు, హత్యలు, లైంగికదాడులను అరికట్టాలని.. మహిళా చట్టాలను కఠినంగా అమలు చేసి మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వ జూనియర్, ఐటిఐ కళాశాల మధ్యాన భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. విద్యార్థులు విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేయడం కోసం భవిష్యత్ కార్యచరణ రూపొందించు కోవడం కోసం ఈ ప్లీనరి సమావేశాలు సంగారెడ్డిలో జరుగుతున్నాయని.. కాబట్టి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎర్రోళ్ల మహేష్, నాల్లవల్లి రమేష్, సహాయ కార్యదర్శులు రజినీకాంత్, సాక్షి, రవికిరణ్ గౌడ్, బి.రజినీకాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి కార్మికులను పర్మినెంట్ చేయాలి

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన ప్రభుత్వ హాస్పిటల్ ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టి.. అనంతరం కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులకు కనీస వేతలను అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పేషంట్ కేర్, వానిటేషన్, స్వీపర్స్, సెక్యూరిటీ గార్డ్స్ చాలా సమస్యలతో బాధపడుతున్నారన్నారు. కార్మికులను కాంట్రాక్టర్ చాలా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం వేతనాలు చెల్లించకుండా తక్కువ చెల్లిస్తున్నారన్నారు. అన్ని హాస్పిటల్స్‌లో ప్రభుత్వం నిర్ణయించిన రూ.15,600 కార్మికుడికి రూ. 12,093 చెల్లించి మిగిలినవి పిఎఫ్, ఈఎస్ఐ ఖాతాలలో జమ చేయాల్సి ఉందని.. కానీ కాంట్రాక్ట్ సంస్థలు అన్నీ కుమ్మక్కై రాష్ట్రవ్యాప్తంగా రూ.10,500, రూ.11,000 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. లక్షల రూపాయలు కార్మికుల డబ్బు కాజేస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం చెల్లించే విధంగా హాస్పిటల్స్ అధికారులకు, కాంట్రా క్టర్లకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పిఎఫ్, ఈఎస్ఐ వాటాలు ప్రతినెలా కార్మికుల జీతాల్లో జమ చేయాలన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలన్నారు.హాస్పిటల్ వర్కర్స్‌కు డ్రెస్ చేంజ్ రూమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. రెస్ట్ రూమ్‌లు లేకపోవడంతో భోజనాలు వరండాలు, వార్డులు, చెట్ల కింద చేస్తున్నారన్నారు. ఐడి కార్డు, యూనిఫాం, బ్లౌజులు, షూస్, ఇతర పరికరాలు సరిపడా లేవన్నారు. ఈ సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాట నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాదగిరి, యాదయ్య, శ్రీకాంత్, కిరణ్, శోభ, మరియమ్మ, అలీమా, రత్నయ్య, సునీత, అనిత, నిఖిత, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న డా.అయేషా తన్వీర్

నవతెలంగాణ-సంగారెడ్డి

30 మంది మహిళలతో కలిసి డా.అయేషా తన్వీర్ సంగారెడ్డి పట్టణంలోని చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీ కండువా కప్పి చింతా ప్రభాకర్ సాదరంగా ఆహ్వానించారు. కాగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ గెలుపు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చింత ప్రభాకర్ మాట్లాడుతూ.. మహిళా సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం వివిధ పథకాలు ప్రవేశపెట్టి.. వారికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా సంక్షేమం, అభివృద్ధి అమలు అవుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు, సీడీసీ మాజీ చైర్మెన్ విజేందర్ రెడ్డి, నాగరాజ్ గౌడ్ , కౌన్సిలర్ శ్రీకాంత్, శేకర్, అజ్జు, విక్రాంత్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాల ఏర్పాటు

నవతెలంగాణ-సంగారెడ్డి

ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఈనెల 26, 27, సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక శిబిరాల రోజుల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) సంబంధిత పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఓటరు జాబితాతో అందుబాటులో ఉంటారన్నారు. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం -6, సవరణలు, మార్పులు, చేర్పులకు ఫారం 8, తొలగింపునకు ఫారం 7ను ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆయా ఫారాలు అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓల వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. ప్రత్యేక క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఓటరు జాబితాలో తమ పేరు ఉన్నది లేనిది, ఏవేనితప్పులు ఉన్నాయా అన్నది చెక్ చేసుకోవాలన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు వజ్రాయుధం లాంటిదని, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటే కీలకమని గుర్తించాలన్నారు. కాబట్టి జిల్లాలో 18 ఏండ్లు నిండిన వారు, మరియు 2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏండ్లు నిండబోయే వారందరూ ప్రత్యేక శిబిరాలను వినియోగించుకొని ఓటరుగా నమోదు కావాలన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లోకి చేరికలు

నవతెలంగాణ-జహీరాబాద్

కాంజమల్పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ వార్డ్ మెంబర్ గొల్ల నర్సింలు, వివిధ పార్టీలకు చెందిన మాజీ మండల అధ్యక్షుడు నారాయణ, సర్పంచ్ ప్రసాద్, సురేష్, మోహన్ రెడ్డిలు సమక్షంలో ఎమ్మెల్యే మాణిక్ రావు సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, జహీరాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాణిక్‌రావులు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై బీఆర్ఎస్‌లో చేరినట్టు తెలిపారు. కాగా ఎమ్మెల్యే నేతృత్వంలో తమ గ్రామాభివృద్ధికి పాటు పడతామని ప్రతిజ్ఞ చేశారు. పార్టీలో కొత్తగా చేరిన వారికి సముచిత గౌరవ మర్యాదలు ఉంటాయని ఎమ్మెల్యే చెప్పారు. చేరిన వారిలో గొల్ల నర్సింలు మాజీ కాంగ్రెస్ వార్డ్ మెంబర్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు కార్యకర్తలు సిద్దప్ప, విఠల్, తుకారాం, గణేష్, జైపాల్, ప్రశాంత్, నరేష్, శ్రీశైలం, గణేష్, సిద్దప్ప, రామ్, మహిపాల్, మోహన్‌రావు, అన్నపురం అశోక్, గొల్ల పరుశురాం, వీరన్న, జమాల్, కైలాష్, రామ్‌లు కలిపి 25 మంది ఉన్నారు.

హెూటల్ మేనేజ్మెంట్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఆధ్వర్యంలో హెూటల్ మేనేజ్మెంట్ కోర్సును ప్రారంభిస్తున్నట్టు బీసీ సంక్షేమ సంఘం గురుకుల పాఠశాలల ఉమ్మడి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 65 నేషనల్ హైవే కోహిర్ ఎక్స్ రోడ్‌లో డిగ్రీ కళాశాల ఉన్నదని.. హెూటల్ మేనేజ్మెంట్ మూడేండ్ల డిగ్రీ కోర్సులకు గాను మొదటి సంవత్సరానికి సంగారెడ్డిలోని కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకొనే విద్యార్థులు ఇంటర్ పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆయా సర్టిఫికేట్లతో ఆర్‌సీఓ కార్యాలయాన్ని సంప్రందించాలన్నారు. మరిన్ని వివరాలకు 9848089333 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.



పదో రోజుకు సెకండ్ ఏఎన్ఎంల సమ్మె

నవతెలంగాణ-సంగారెడ్డి

సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని.. నోటిఫికేషన్ రద్దు చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారానికి పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి బోయిని లక్ష్మి మాట్లాడుతూ.. గత పది రోజుల నుండి నిరవధిక సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం మాయ మాటలు చెప్పి పబ్బం గడుపుతున్నదన్నారు. వెంటనే సెకండ్ ఏఎన్ఎంలతో చర్చలు జరిపి సమ్మె విరమించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, మమత, శాంతా, మంజుల, రోజా, మేఘన, భారతి తదితరులు పాల్గొన్నారు.



పుల్కల్ తహసీల్దార్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ మండల నూతన తహసీల్దారుగా భాస్కర్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. కాగా ఆయన్ను బీఆర్ఎస్ నాయకులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో ఉన్న భూ సమ స్యలు ఇతర సమస్యలను వెనువెంటనే పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పుల్కల్ ఎంపీటీసీ శ్రీనివాస్ చారి, పుల్కల్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ అబిక్, సింగూర్ ఎంపీటీసీ మంజుల వీరారెడ్డి, పార్టీ నాయకులు మన్నే విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గాలి పోచమ్మ గుడి పనుల పరిశీలన

నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని పెద్దమ్మ గూడెం గ్రామంలో నిర్మిస్తున్న గాలి పోచమ్మ ఆలయ నిర్మాణ పనులను జిన్నారం మండల పరిషత్ అధ్యక్షులు దమ్మ గోని రవీందర్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణ క్రమంలో తనవంతుగా రూ.60,000 పైచిలుకు నిధుల సాయాన్ని అందించినట్టు చెప్పారు. మరో 20 వేల ఆర్థిక సహాయాన్ని త్వరలో అందిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సోలక్ పల్లి సర్పంచ్ దాసరి శ్రీకాంత్ రెడ్డి, ఊట్ల ఉపసర్పంచ్ జింకల రవి,రాములు యాదవ్,యాదయ్య యాదవ్, యనగండ్ల నరేందర్,అశోక్ యాదవ్, శివ యాదవ్, రాధాకృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.



ఉర్సు ఉత్సవంలో పాల్గొన్న రాములు యాదవ్

నవతెలంగాణ-జహీరాబాద్

మొగుడంపల్లి మండలం మాడికి గ్రామంలో గల దర్గా హజ్రత్ సయ్యద్ హైదర్ హుస్సేన్ షా, ఖాద్రీ రెహ సజ్జదా నాషిన్ సయ్యద్ సబీర్ అలీ షా ఖాద్రీ దర్గాలో నిర్వహించిన ఉర్సు ఉత్సవంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాములు యాదవ్ తమ అనుచరులతో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయనకు దర్గా ఆస్తానికులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ మహ్మద్ ఫరీద్ షా అర్షద్ పటేల్, మొగుడంపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు మక్సూద్ అహ్మద్, ఎంపీపీ గండారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కార్జున్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కార్జున్ రెడ్డి, ఎస్సీ సెల్గోపాల్, కొప్పన, మోహన్ రెడ్డి, బ్రదర్ వెంకట్ రెడ్డి, నాగప్ప సరస్గి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో దుర్గంధం



- సంగారెడ్డి నుంచి తెచ్చి.. బస్వాపూర్ శివారులో పారబోస్తున్న వైనం
- రోగాల బారిన పడుతున్న రైతులు, విద్యార్థులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-పుల్కల్

సంగారెడ్డి పట్టణం నుంచి 13 టిప్పర్లలో వ్యర్థ పదార్థాలను తీసుకువచ్చి పుల్కల్ మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామ శివారులో గల సబ్‌స్టేషన్ వెనక ప్రాంతంలో గత మూడు రోజులుగా పారబోస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతు న్నది. ఆ పక్కనే ఉన్న ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఈ దుర్వాసన భరించలేక ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. కొందరు విద్యార్థులు వాంతులు, విరోచనాలు సైతం చేసుకుంటు న్నారు. అంతేకాకుండా చుట్టు పక్కల ఉన్న రైతులు తమ పంట పొలాలకు వెళ్లాలంటే జంకుతున్నారు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి సుమారు 12 గంటల సమయంలో ఆయా గ్రామాల ప్రజలు అక్కడికి చేరుకొని.. వ్యర్థ పదార్థాలతో వచ్చిన వాహనాలను అడ్డుకున్నారు.పుల్కల్ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పుల్కల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వ్యర్థ పదార్థాలు తెచ్చిన వాహనాలను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

జోగిపేట సీఐ నాగరాజును వివరణ కోరగా.. వ్యర్థ పదార్థాలు సంగారెడ్డి నుంచి వచ్చిన మాట వాస్తవమే అని.. కానీ ఇంత దుర్వాసన వస్తుందని ఊహించలేదన్నారు. ఈ విషయాన్ని సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి.. ఆ వ్యర్థ పదార్థాలను వెంటనే అక్కడి నుండి తొలగించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోనే అతిపెద్దదైన సింగూరు ప్రాజెక్టును చూసేందుకు దూర ప్రాంతాల నుంచి పర్యాటలకులు వస్తుంటారని.. కాబట్టి వెంటనే ఈ వ్యర్థ పదార్థాలను తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చారన్నారు


దుర్గంధం నుంచి కాపాడండి సారూ..

– సింగూరు గురుకుల పాఠశాల విద్యార్థుల ఆవేదన

సింగూరు గురుకుల పాఠశాలలో సుమారు 650 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే పాఠశాల సమీపంలో డంపు చేసిన వ్యర్థాల నుంచి అయితే గత మూడ్రోజులుగా దుర్గంధం వస్తున్నదని పిల్లలు వాపోతున్నారు. దీంతో భోజనం కూడా చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసన భరించలేక కొందరు విద్యార్థులు వాంతులు కూడా చేసుకున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ రామ కృష్ణ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన వెంటనే ఫోన్ ద్వారా అధికారులకు తెలిపారన్నారు. వెంటనే ఈ వ్యర్థ పదార్థాలను ఇక్కడి నుండి తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.



వెంటనే తొలగించాలి



రాత్రి సమయాల్లో ఎవ్వరికి తెలవకుండా సంగారెడ్డి పట్టణం నుండి 13 టిప్పర్ల ద్వారా అక్కడి వ్యర్థ పదార్థాలను పంట పొలాల దగ్గర వేస్తున్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. ఇతర మండలాల వ్యర్థ పదార్థాలు తెచ్చి ఇక్కడ వేయడం సరికాదు. వెంటనే ఈ వ్యర్థ పదార్థాలను తొలగించాలి.

– తలారి అంజయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు

పొలం దగ్గరికి వెళ్లలేకపోతున్నా..



పెట్టుబడికి అధిక వడ్డీలకు రుణాలు తెచ్చి ఉన్న రెండు ఎకరాల్లో వరి నాట్లు వేశాను. ఆ నాట్లు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. అయితే మూడ్రోజుల నుంచి పొలానికి నీరు పారించేందుకు వెళ్తుంటే.. తీవ్రమైన దుర్గంధం వస్తున్నది. పొలం దగ్గర ఉండలేకపోతున్నాను. పొలాన్ని చూసుకోకుంటే.. వరిపంట మొత్తం ఎండిపోయే పరిస్థితి ఉన్నది. వెళ్దామంటే వాంతులు, విరోచనాలు వస్తున్నాయి. అధికారులు స్పందించి ఇక్కడ డంపు చేసిన వ్యర్థ పదార్థాలను తొలగించాలి.

-మైసన్న గారి మానయ్యా, రైతు(పుల్కల్)

పటాన్‌చెరు ఇక రెవెన్యూ డివిజన్

- ఆర్డీవో కార్యాలయం, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు జీవోల జారీ
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-పటాన్‌చెరు



పటాన్‌చెరు కేంద్రంగా రెవెన్యూ డివిజన్, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం జీవోలు జారీ చేసిందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలకు రెవెన్యూ డివిజన్ సేవలు అత్యంత అవసరమని ఇటీవల పటాన్‌చెరులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో పాలిటెక్నిక్ కళాశాల లేకపోవడం మూలంగా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించడం లేదని విన్నవించామన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన సీఎం కేసీఆర్.. ప్రజల సమక్షంలోని హామీలు ఇవ్వడంతో పాటు, గురువారం వీటికి సంబంధించిన జీవోలు జారీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఇప్పటివరకు సంగారెడ్డి రెవెన్యూ డివిజన్‌లో గల పటాన్ చెరు, రామచంద్రాపురం, అమీన్పూర్, గుమ్మడిదల, జిన్నారం మండలాలతో కూడిన పటాన్‌చెరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కాబోతుందన్నారు. నూతన పాలిటెక్నిక్ కళాశాలకు సైతం అతి త్వరలో స్థలం కేటాయించి భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. గతంలో పటాన్‌చెరు సబ్ రిజిస్ట్రార్, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసిందని, ఇందుకు సంబంధించి పలువురు అభ్యంతరాలు లేవనెత్తడంతో.. కేవలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేసి తిరిగి ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. వచ్చేనెల సెప్టెంబర్ రెండో వారంలో రెవెన్యూ డివిజన్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు నిర్మించ తలపెట్టిన మెట్రో రైలు పనులకు సంబంధించి ప్రాథమిక ప్రక్రియ తుది దశకు చేరుకున్నదరు. వీటితోపాటు ఉస్మాన్ నగర్‌లో ఐటీ టవర్ ఏర్పాటుకు సంబంధించి సంబంధిత శాఖ సన్నాహాలు ప్రారంభిం చిందన్నారు. వాటితోపాటు మండల కేంద్రమైన గుమ్మడిదలలో మినీ స్టేడియం, జూనియర్ కాలేజ్, వ్యవసాయ గోదాం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్టు తెలిపారు. ప్రజలకు హామీలు ఇవ్వడంతో పాటు వాటి అమలుకు కృత నిశ్చయంతో పనిచేస్తున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ అన్ని స్థాయిల నాయకులు పాల్గొన్నారు.



సంగారెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని బాచేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సంగారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి సంగారెడ్డి పట్టణంలో గల హెూప్ న్యూరో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి సంగారెడ్డిని పరామర్శించి రోడ్డు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకొని ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన డ్రైవర్‌ని కలిసి ఆరోగ్య స్థితిని గూర్చి డాక్టర్లను అడిగి తెలుసుకుని.. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఆయనతోపాటు బొక్కాస్ గావ్ పీఏసీఎస్ చైర్మెన్ గుండు వెంకట్ రాములు ఉన్నారు.



శ్రీ గణేష్ గడ్డ సిద్ధి గణపతి హుండీ లెక్కింపు

66 రోజులకు రూ.13,66,927 ఆదాయం

నవతెలంగాణ-పటాన్‌చెరు

మండలంలోని రుద్రారం గ్రామపంచాయతీ పరిధిలో గణేష్ గడ్డలో స్వయంభూ గా వెలసిన సిద్ధి గణపతి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపును ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. 66 రోజులకు రూ. 13,66,927 ఆదాయం, అన్నదానం హుండీ ఆదాయం రూ.91,414 భక్తులు కానుకల రూపంలో సమర్పించినట్టు ఆలయ ఈఓ మోహన్ రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపు ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.శివరాజ్, ఇన్స్పెక్టర్ రంగారావు సమక్షంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుండీలో వచ్చిన ఆదాయాన్ని దేవాలయం అభి వృద్ధికి ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలను సమకూర్చుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఆశా'ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం







నవతెలంగాణ-పటాన్‌చెరు

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి.నాగేశ్వరరావు ఆరోపించారు. పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం పారితోషకం రూపంలో ఆశాలకు రూ.9750 మాత్రమే ఇస్తున్నారని.. అలా కాకుండా ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు గీతా,హైమవతి, లక్ష్మి,లావణ్య ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జోగిపేట : ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని సీఐటీయూ ఆందోల్ డివిజన్ కార్యదర్శి డి విద్యాసాగర్ ఆరోపించారు. జోగిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి.. అనంతరం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాలతో వెట్టిచాకి చేస్తున్నారు తప్పా.. వారికి కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. కరోనా సమయంలో ఫ్రంట్ వారియర్‌గా సేవలందించి అందరి మన్ననలు పొందిన ఆశ వర్కర్లను.. ప్రభుత్వాలు గుర్తించకపోవడం చాలా దారుణమన్నారు. గ్రామాలలో పేదలకు అనేక సేవలు చేస్తున్నారని.. బాలింతలకు, వృద్ధాప్యంలో ఉన్న వారికి సర్వేలు, తేమడ వంటి అనేక పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. అయినా ప్రభుత్వాలు వారికి కనీస వేతనం కల్పించడం లేదనారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. వారికి కనీస వేతనం, ఉద్యోగ భద్రత వంటి సౌకర్యాలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ నాయకులు లక్ష్మి, అంజమ్మ, కృష్ణవేణి, సంతోష, భాగ్యమ్మ, సుజాత, కవిత, ఆదివమ్మా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వట్‌పల్లి : గత 18 ఏండ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో అనేక రకాలైన సేవలను అందజేస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని స్థానిక తహసీల్దార్‌కు ఆశా వర్కర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలన్నారు. టీబి స్పెక్ట్రమ్ సిస్టం రద్దు చేయాలన్నారు. అదేవిధంగా ఏజేసి టార్గెట్‌ను రద్దుచేసి ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగమణి, నీరజ, అనురాధ, విజయలక్ష్మి, యాదమ్మ పద్మమ్మ, సువర్ణ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను గద్దె దింపే వరకు నిద్రపోము



నవతెలంగాణ-సంగారెడ్డి

'సీఎం కేసీఆర్‌ను గద్దె దింపే వరకు నిద్రపోము' అని మాజీ మంత్రి బాబు మోహన్, బీజేపీ జిల్లా అధ్యక్షులు యం. నరేందర్ రెడ్డి అన్నారు. నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ముట్టడి నిర్వహించగా.. ముఖ్య అతిథులుగా బాబు మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పదేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా నెరవేర్చకపోవడం సిగ్గుచేటు అన్నారు. మళ్లీ అవే హామీలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కాగా నిరసనటు చేపట్టకుండా.. పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయడం అత్యంత నీచమైన చర్యగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విష్ణువ ర్ధన్ రెడ్డి, రాజేశ్వరరావు దేశ్పాండే, రాష్ట్ర త్రీ మెయిన్ కమిటీ మెంబర్ విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కొండాపురం జగన్, జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంత రెడ్డి,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

నవతెలంగాణ-వట్‌పల్లి



న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రగతి భవన్ ముట్టడికి గిరిజనులు పిలుపునిస్తే.. వారిని అడ్డుకొని ముందస్తు అరెస్టులు చేసి స్టేషన్‌లకు తరలించడం అప్రజాస్వామికం అని వట్‌పల్లి మండల బంజారా బేరి అధ్యక్షుడు అన్నారు. బంజారా బేరి రాష్ట్ర అధ్యక్షుడు దాస్ రం పిలుపు మేరకు శుక్రవారం ప్రగతి భవన్ ముట్టడికి బయల్దేరనున్న తమను.. ఉదయం 5 గంటల ప్రాంతంలో పోలీసులు ఇండ్ల వద్దనే అరెస్టులు చేసి స్టేషన్‌కు తరలించడం గిరిజనుల హక్కులను పోలీసులు కాలరాయడ మేనని అన్నారు. గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి అమలు చేయలేదని.. ముఖ్యమంత్రి హామీలు గాలి మాటలుగానే మిగిలిపోయాయన్నారు.గ్రామపంచాయతీగా ఏర్పాటైన తాండలకు డీలర్ షిప్‌ను నియమించాలన్నారు. గిరిజన పంచాయతీ తాండాలను రెవిన్యూ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. కాగా త్వరలోనే బంజారా బేరి తమ కార్యాచరణను ప్రకటించి.. దశలవారీగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పోరాటం చేసి హక్కులను సాధించుకునేవరకు ఊరుకోబోమన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్, గణపతి, లక్ష్మణ్, నగేష్, మేడికుంద తాండ రమేష్, శ్రీను, మంచిర్యాల తండా సురేష్, వట్‌పల్లి తండా నాయకులు ఉన్నారు.

చిట్కాలు పాటిస్తే మామిడి, జామ సాగులో మంచి దిగుబడి

నవతెలంగాణ-జహీరాబాద్



మామిడి, జామ తోటల పెంపకం చేసే రైతులు చిట్కాలను పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చని కొండా బాపూజీ ఉద్యానవన శాస్త్రవేత్త సరిత అన్నారు. మామిడి, జామ తోటల్లో తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై శుక్రవారం రంజోల్ రైతు వేదికలో రైతులకు, కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల రాజేంద్రనగర్ విద్యార్థులకు ఏరువాక కేంద్రం జోగిపేట శాస్త్రవేత్త సరిత అవగాహన కల్పించారు. పండు ఈగ నివారణ గురించి క్షేత్ర ప్రదర్శన ద్వారా రైతులకు, విద్యార్థులకు వివరించారు. లింగాకర్షక బుట్టలను అమర్చుకోవడం ద్వారా పండు ఈగ నివారణ చేపట్టవచ్చని.. అలాగే పిండి నల్లి, నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. నులిపురుగుల నివారణకు గాను ఒక కిలో ట్రైకోడెర్మా విరిడిని 100 కిలోల పశువుల ఎరువులో కలుపుకొని శిలీంద్రం వృద్ధి చెందే వరకు ఉంచి మొక్కలకు అందజేయాలన్నారు. అదేవిధంగా నులిపురుగుల లక్షణాలను ఏ విధంగా గుర్తించాలో కూడా రైతులకు సూచించారు. రసం పీల్చే పురుగుల నివారణకు మిరప, టమాటోలు నీలి పసుపు జిగురు పట్టాలను అమర్చుకోవాలన్నారు. పండు ఈగ నివారణకు గాను ఎకరానికి 10 నుంచి 15 బుట్టలను అమర్చుకోవాల్సిలని.. అదేవిధంగా రసం పీల్చే పురుగులకు గాను జిగురు పట్టాలను 8 నుంచి 10 వరకు అమర్చుకోవాలన్నారు. అదేవిధంగా సోయాబీన్‌లో చిరు సంచి ప్రదర్శనకు ఆదిలాబాద్ రకం ఏఎస్‌బి 15ను రైతుల పొలంలో ప్రదర్శించారు. అదేవిధంగా కంది రకం డబ్ల్యూఆర్‌జిఈ 97 రకాన్ని సోయాబీన్‌లో అంతం పంటగా వేసిన పొలాన్ని కూడా సందర్శించి సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త సరిత వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్, ప్రవీణ్, గోద్రెజ్ అగ్రీవేట్ పామ్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులు, రైతులు మోహన్, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ, మల్లేష్, డైమండ్ గుడ్డు ఫిరోజ్, మైపాల్ రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-పుల్కల్



హరితహారంలో భాగంగా పుల్కల్ మండల పరిధిలోని సింగూరు గ్రామంలో ఉన్న ప్రాజెక్టు వద్ద మూడు ఎకరాల స్థలంలో వివిధ రకాలైన సుమారు కోటి మొక్కలను నాటేం దుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్టు బీఆర్ఎస్ పుల్కల్ మండలాధ్యక్షులు మాచర్ల విజయకుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు పెంచడంతో.. వాటి ద్వారా వచ్చే స్వచ్ఛమైన గాలి ఆక్సిజన్ మానవులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇలాంటి కార్యక్రమాలు కేవలం తెలంగాణలో మాత్రమే తమ అధినేత కేసీఆర్ చేపట్టడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ శరత్, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి, ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ హాజరవుతారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

బీసీ బంధులో భూమి లేనివారికే మొదటి ప్రాధాన్యతనివ్వాలి

కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షులు దర్జీ రాజు

నవతెలంగాణ-కొల్చారం



బీసీ బందులో గుంట భూమి లేని నిరుపేదలను గుర్తించి వారికే మొదటి ప్రాధాన్యతనివ్వాలని కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షులు దర్జీ రాజు అన్నారు. శుక్రవారం ఆయన ఎంపీడివో గణేష్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దర్జీ రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బంధు పథకంలో భాగంగా గుంట భూమిలేని బీసీ నిరుపేదలకు మొదటి ప్రాధాన్యతనివ్వాలని కోరారు. అదేవిధంగా లబ్ధిదారుల ఎంపికలో శాస్త్రీయ పద్ధతిని పాటించాలని, గ్రామస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలంటే రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా చూడాలన్నారు. అర్హుల జాబితా క్షేత్రస్థాయి అధికారులచే తెప్పించుకుని, ఎంపీడీవో, కలెక్టర్ సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు విఠల్, నర్సింలు, యాదగిరి, రాజు, శేకర్, శ్రవణ్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలసిన ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి

నవతెలంగాణ-మెదక్



నూతనంగా నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి జిల్లా కలెక్టర్ రాజర్షిషా , అడిషనల్ కలెక్టర్లు రమేష్, వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖల కార్యాలయాలు ఒకే చోట ఉండడం వల్ల ప్రజల ఇబ్బందులు తీరుతయాన్నారు. ఆయన వెంట మెదక్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ రాగి అశోక్ నాయకులు చింతల నర్సింలు, లింగారెడ్డి, ముజీబ్ ఉన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మీసేవ నిర్వాహకులు





నవ తెలంగాణ-మెదక్ టౌన్

మీసేవ సమస్యలపై తెలంగాణ రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం మెదక్ జిల్లా మీసేవ నిర్వాహకులు అందరూ కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మీసేవ జేఏసీ జిల్లా నాయకులు మాట్లాడుతూ అనేక రకాల సమస్యలతో మీసేవ నిర్వాహకులు సతమవుతున్నామని, గత పది సంవత్సరాల నుంచి కమిషన్లు పెంచలేదని, షాపుల కిరాయిలు, కరెంట్ బిల్లులు, ఇంటర్నెట్ బిల్లులు పెరిగినా కూడా మీసేవ కమిషన్లు పెంచకపోవడం స్టేషనరీ ధరలు కూడా విపరీతంగా పెంచారు. అనేక రకాల సర్వీస్‌లు పహనీ నకల్, ఆర్వోఆర్-1బి లు మీసేవ నుంచి తొలగించడం జరిగిందన్నారు. ఈ విషయాలపైన మీసేవ నిర్వాహకులకు న్యాయం చేయాలని కోరారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం కమిషన్లు పెంచి, మీసేవ నిర్వాహకులకు కనీస సౌకర్యాలు హెల్త్ ఇన్సూరెన్స్, కరెంటు బిల్లు ఉచితంగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మీసేవ జాయింట్ యాక్షన్ కమిటీ తరపున కోరారు. ఈ కార్యక్రమంలో మీసేవ జేఏసీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కల్వకుంటలో డెంగ్యూ కేసులు

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో గ్రామంలో దోమలు విజృంభిస్తున్నాయని, దీంతో డెంగ్యూ, మలేరియా, వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో ప్రధాన కూడలి వద్ద గడ్డి పిచ్చి మొక్కలు పెరగడంతో దోమలు విజృంభిస్తున్నాయన్నారు. ఈ దోమల వలన గ్రామంలో సుమారు ఆరు డెంగ్యూ కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఇకనైనా గ్రామపంచాయతీ పాలకవర్గం పట్టించుకొని గ్రామంలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయంపై సర్పంచ్ తమన్నగారి కృష్ణవేణిని గ్రామ కార్యదర్శి కవితను వివరణ కోరగా, దోమల నివారణకు పిచాకారి చేసే పంపు చెడిపోయినందున రిపేరు చేసి ఒకటి రెండు రోజులలో దోమల మందు పిచికారి చేస్తామన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయన్నారు. గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించడం మోరీలు తీపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మహేందర్ గౌడ్, శివ రాములు, గ్రామస్తులు నాగరాజుగౌడ్, ప్రవీణ్ రెడ్డి, మోసిన్, రియాజ్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన వికలాంగుల పెన్షన్ అంద జేసిన సర్పంచ్

నవతెలంగాణ-నార్సింగి



ముఖ్యమంత్రి కేసీఆర్ దివ్యాంగులకు చేయూతగా ప్రతి నెల అందిస్తున్న రూ.3016ల పెన్షన్‌ను వెయ్యి రూపాయలు పెంచుతూ 4016 చేశారు. ఈ సందర్భంగా మండలంలోని జప్తి శివనూర్ గ్రామంలోని తపాలా కార్యాల యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షరీఫ్ షేక్ పెంచిన పెన్షన్ ను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కలాంగులు, వితంతువులు, వృద్ధులు, బీడీ కార్మికులకు పెన్షన్లు ఇస్తున్నారని, ఇప్పుడు నూతనంగా బీడీ టేకేదారులకు కూడా ఇవ్వనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యుడు నయీం, కో ఆప్షన్ సభ్యుడు బాలమల్లయ్య, మాజీ సర్పంచ్లు అంజయ్య, పరుశు రాంలు, యాదవ సంఘ సభ్యుడు నాగరాజు, యాదగిరి, చిన్న ఎల్లయ్య, గిరి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

టికెట్ కోసం రవీందర్ రెడ్డి దరఖాస్తు

నవ తెలంగాణ-నర్సాపూర్



రానున్న ఎన్నికల్లో నర్సాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సోమన్న గారి రవీందర్ రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాదులోని గాంధీభవన్‌లో టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు.

పంట పొలాల పరిశీలన

నవతెలంగాణ- నిజాంపేట



మండలంలోని నార్లాపూర్ గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ పలు రైతుల పంట పొలాలను పరిశీలించారు. దీనిలో భాగంగా వరిలో మొగి పురుగు ఉధృతి అధికంగా ఉన్నందున దాని నివారణకి కార్తాప్ హైడ్రోక్లోరైడ్ 400గ్రా /ఎ సి ఇ అర్ క్లోరాంత్రనిలిప్రోల్ 60ఎం, ఎల్/ఎ సి అర్ ఇ మందును పిచికారి చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా యూరియా దఫా దఫాలుగా వాడుకోవాలని తెలియజేశారు. ఆలస్యంగా నాట్లు వేసే వారు వరి కొనలను తుంచుకొని దగ్గర దగ్గరగా నాటుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సతీష్ వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత, రైతులు దశరథం, రామచంద్రం, లక్ష్మారెడ్డి రైతులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంకుల సేవలు అభినందనీయం

మెరిట్ సాధించిన విద్యార్థినీలకు నగదు పురస్కారం అందజేత

నవతెలంగాణ- కొల్చారం



మండల కేంద్రం కొల్చారంతోపాటు పోతంశెట్టిపల్లిలోని కెనరా బ్యాంకుల సేవలు అభినందనీయమని కొల్చారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు జెరీనా సుల్తానా అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్చారంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర పాఠశాలలకు చెందిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 9,10 తరగతులలో అత్యధిక మెరిట్ సాధించినందున కొల్చారం కెనరా బ్యాంక్‌తోపాటు పోతంశెట్టిపల్లి బ్రాంచ్‌ల ఆధ్వర్యంలో బ్యాంకు మేనేజర్లు సత్య రమేష్, క్రాంతి కుమార్‌లు విద్యార్థులకు స్కాలర్‌షిప్ రూపంలో నగదు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా కెనరా విద్యాజ్యోతి స్కీం కింద పేద విద్యార్థులకు స్కాలర్షిప్‌ల రూపంలో నగదు పురస్కారం అందజేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా మొదటి ర్యాంకు సాదించిన విద్యార్థినికి రూ.5000, రెండవ ర్యాంకు సాదించిన విద్యార్థినికి రూ.2500 చొప్పున ఇలా పాఠశాలలకు చెందిన పది మంది విద్యార్థులకు అందజేశామని తెలిపారు. బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తమవంతు సహాయంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు తోచిన సహాయం అందజేసినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగు హాస్టల్‌లో ఇంటర్మీడియట్‌లో స్పాట్ అడ్మిషన్లు

నవ తెలంగాణ-మెదక్ టౌన్



సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల మెదక్‌లో ఎంఈసి గ్రూప్‌లో ఖాళీగా ఉన్న 11 సీట్లలో చేరుటకు అర్హత కలిగిన విద్యార్థులకు ఈ నెల 26వ తేదిన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ వరలక్ష్మి తెలిపారు. ఎస్ఎస్‌సి ఒరిజినల్ మెమో, బొనాఫైడ్, క్యాస్ట్ ఇన్కమ్, రెసిడెన్స్ సర్టిఫికెట్స్, ఆధార్, రేషన్ కార్డు మొదలగు జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- 1వ తేదిన హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి మహాధర్నా
- ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పీఆర్సీ కమిటీని వేయాలి
- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటి నాయకులు చావ రవి, కొమ్ము రమేష్



నవ తెలంగాణ-మెదక్ టౌన్

ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీన హైదరాబాదులోనీ ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ యూపిఎస్‌సీ రాష్ట్ర నాయకులు కోరారు. మెదక్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో శుక్రవారం ఉదయం నిర్వహించిన యూపిఎస్‌సి చలో హైదరాబాద్ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథులుగా యూఎస్పిసి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, కొమ్ము రమేష్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని-2020ని రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులకు, ఉద్యోగుల కొరకు పిఆర్సి కమిటీ వేయాలని, జులై 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవతో ఉపాధ్యాయుల పదోన్నతుల బదిలీలు చేపట్టాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పండిట్, పిఈటీలకు ప్రమోషన్ కల్పించాలని, డిఎస్ సి 2003 వారికి వెంటనే పాత పెన్షన్ వర్తింప చేయాలనే తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 1న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహించే మహాధర్నాకు మెదక్ జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెన్షనర్లు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కొండల్ రెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, కే పద్మారావు, వి సంగయ్య, యాదగిరి, కే అజయ్ కుమార్, సిహెచ్ రవీందర్ రెడ్డి, బీమ్లా నాయక్, ఎన్ సుధాకర్, యేసయ్య, శేఖర్, భూషణంలతో పాటు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ భాగస్వామ్య సంఘాల నాయకులు నాగరాజు, నాగుల్ మీరా, షాకిర్ అలీ ఫయాజుద్దీన్, ప్రేమ్ కుమార్, కొమ్మ శ్రీను, భుజంగ రెడ్డి, టిపిటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగయ్య, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రావ్, టిపిటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాదగిరి, బీటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రమేష్, ఉపాధ్యక్షులు కిషన్, టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మారావు, యూఎస్పిసి నాయకులు హిరాలాల్, సత్యనారాయణ, గోపాల్, భాస్కర్ రెడ్డి, వెంకటేశం, చంద్రయ్య, శీతల్ సింగ్, భూషణం తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-సంగారెడ్డి

ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదిన తలపెట్టిన రాష్ట్ర స్థాయి మహాధర్నాను విజయవంతం చేయాలని యూఎస్‌పిసి రాష్ట్ర నాయకులు చావ రవి, కొమ్ము రమేష్‌లు కోరారు. సంగారెడ్డి లో ఎస్కెంకి కళాశాలలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి వారు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా చావ రవి, కొమ్ము రమేష్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తూ అనేక సమస్యలను పెండింగ్‌లో ఉంచడం సరి కాదన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగారం శ్రీనివాస్, అశోక్ అనుముల రామచందర్, సాయిలు, యూఎస్ పిసి నాయకులు సంజీవయ్య, లక్ష్మయ్య యాదవ్, సోమ శేఖర్, జ్ఞాన మంజరి, శ్రీనివాస రావు, అరుణశ్రీ, రాజీ రెడ్డి, నాజర్ పటేల్, విజయ భాస్కర్, చందర్ రాథోడ్, కృష్ణం రాజు, విజయానంద్, విజేందర్ రెడ్డి, జగన్నాథం, దేవేందర్, సంతోష్, అనురాధ, స్వప్న, ప్రభాకర్, కిష్టయ్య, పుల్లమ్మ, కవిత, దుర్గయ్య, అంజయ్య, జగన్మోహన్, మోసిన్ పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- ఎంపీపీ మాసుల శ్రీనివాస్

నవతెలంగాణ-చేగుంట

హరితహారంలో భాగంగా గ్రామానికి 750 మొక్కలు నాటి భవిష్యత్ తరాలకు మంచి భవిష్యత్తునివ్వాలని ఎంపీపీ మాసుల శ్రీనివాస్ కోరారు. చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ మాసుల శ్రీనివాస్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. కొంతమంది టీచర్లు సమయపాలన పాటించడం లేదని సభ్యులు ఆరోపించారు. అదే విధంగా కొంత మంది టీచర్లు మన ఊరు మనబడి కింద పాఠశాల భవనాలను కాంట్రాక్టు తీసుకొని నిర్మిస్తున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచులు సభలో ఫిర్యాదు చేశారు. గ్రామాలలో అక్కడక్కడ సిసి రోడ్లు, మురికి కాలువలు, అండర్ డ్రైనేజీ పనులు పూర్తి కాలేదని అవి త్వరలోనే పూర్తి చేయాలని అధికారులను వేడుకున్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పరిచి నెలలు గడుస్తున్నా విద్యార్థులకు క్రీడా మెటీరియల్ అందించలేదని ప్రజాప్రతినిధులు తెలుపగా స్థానిక ఎంపీడీవో ఆనందమేరీ మాట్లాడుతూ స్పోర్ట్స్ మెటీరియల్ వచ్చాయని, ఇంకా మనకు పైనుంచి అనుమతులేమీ రాలేదన్నారు. పట్టణ కేంద్రంలో అక్కడక్కడ చెత్త నిలువ ఉంటుందని, పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు, తక్షణమే స్పందించి వాటిని తొలగించాలని కోరారు. అలాగే బి కొండాపూర్ గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో టీచర్ లేక చాలా రోజులవుతున్నా ఇప్పటివరకు అంగన్వాడీ టీచర్లను నియమించలేదని సర్పంచ్ బాల నర్సు, ఎంపీటీసీ నవీన్‌లు తెలుపగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ సువర్ణ షైనీ పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే నోటిఫికేషన్ వెలువడేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పని చేయకుండా, సమయ వేళలు పాటించకుండా, కాంట్రాక్టు పనులు చేస్తున్న ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్, మంత్రి హరీష్ రావు దృష్టిలోకి



తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును కల్పించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం నిర్వహించే హరితహారం కార్యక్రమం లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్, ఎంపీ ఓ, పి ఆర్ ఏ లు, ఇరిగేషన్ ఏఈ మమత, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెరిగిన పెన్షన్‌తో దివ్యాంగులలో సంతోషం

నవతెలంగాణ-నార్సింగి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అనేక సంక్షేమ పథకాలలో ఆసరా పెన్షన్ ఒకటి. ప్రతీ నెలా అర్హులైన దివ్యాంగులకు, వితంతువులకు, వృద్ధులకు, బీడీ కార్మికులకు పెన్షన్ డబ్బులు అంద జేస్తున్నందుకు కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలలో మంచి పేరును తెచ్చింది. పెన్షన్ అమలు అవుతున్న వేరే రాష్ట్రాల లో అన్నింటి కంటే అధికంగా, ప్రతి నెలా తెలంగాణ రాష్ట్రం లో నే ఇవ్వడం జరుగుతుంది. గతం లో వృద్ధులు వికలాంగులు మొదలగు వారు వేరొకరి పై ఆధార పడాల్సి వచ్చేది. వారి బ్రతుకులు దయనీయంగా ఉండేవి. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వ హయాంలో నామ మాత్రంగా పెన్షన్ డబ్బులు, అవి కూడా మూడు నాలుగు నెలలకు ఒక సారి అందించే వారు, వాటి కోసం ప్రజలు ఎదురు చూస్తూ ఉండే వారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం ముఖ్య మంత్రి కెసిఆర్ ఆసరా పెన్షన్ పథకం ప్రవేశ పెట్టి అర్హులైన అందరికీ రుసుము ను పెంచి, ప్రతి నెలా జీతం లాగా ఖచ్చితంగా అందే ఏర్పాటు చేశారు. ఇప్పటి పెన్షన్ పథకం వల్ల వారు వేరే వారిపై ఆధార పడాల్సిన అవసరం లేకుండా స్వతంత్రంగా గర్వంగా బ్రతకడానికి కేసీఆర్ చేయూతనిస్తున్నారు. నార్సింగి మండలం వ్యాప్తంగా ప్రస్తుతం ఆసరా పెన్షన్ పథకంలో భాగంగా 854 మంది వృద్ధులకు, 1018 వితంతువులకు, 219 దివ్యాంగులకు, 26 కల్లుగీత కార్మికులకు, 62 ఒంటరి మహిళలకు, 1259 బీడీ కార్మికులు మొత్తం కలిపి 3438 అర్హులకు పెన్షన్లు అందజేస్తున్నారు. దివ్యాంగులకు అందజేస్తున్న పెన్షన్ రుసుమును రూ.3016 నుంచి రూ.4016 పెంచి ఇస్తుండటం పట్ల దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. శుక్రవారం నార్సింగి పట్టణంలోని తపాలా కార్యాలయంలో పెన్షన్ డబ్బులు తీసుకోవడానికి వచ్చిన దివ్యాంగుల ముఖాలపై సంతోషం కనిపించింది.

సంతోషంగా ఉంది

బ్యాగరి రామచంద్రం, నార్సింగి గ్రామం



నాకు చిన్నప్పుడు పోలియో వచ్చింది. నేను ఏ పని చేసుకోలేను. ఇంటి వద్ద చిన్న కొట్టు నడుపుతూ జీవనం



సాగించే వాడిని. ఇల్లు గడవడం కష్టంగా ఉండేది. సీఎం కేసీఆర్ తనకు పెన్షన్ మంజూరు చేసిండు. అప్పటి నుంచి ప్రతి నెల రూ.3016 వచ్చేవి, ఇప్పుడు 4016 చేసిండు. చాలా సంతోషంగా ఉంది. నాలాంటి వారికి బ్రతకడానికి చేయూతనిచ్చి మమ్ములను ఆదుకున్న కేసీఆర్‌కు చేతులెత్తి నమస్కరిస్తున్న.

సీఎంకు కృతజ్ఞతలు

ముసర్రత్ బేగం, నార్సింగి పట్టణం



మా లాంటి దివ్యాంగులకు పెన్షన్లు ఇస్తూ స్వతంత్రంగా జీవించడానికి చేయూతనిస్తున్న ముఖ్య మంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు. ఇప్పుడు వెయ్యి రూపాయలు పెంచడంతో చాలా ఆనందంగా ఉంది. మేము ఇక ఎవ్వరిపై ఆధార పడాల్సిన అవసరం లేదు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన బీజేపీ శ్రేణులు

- పలువురు బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్
- కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద బీజేపీ నాయకుల ధర్నా
- అరెస్టు చేసిన పోలీసులు



నవతెలంగాణ-మెదక్

తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చారని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ శ్రేణులు కలెక్టరేట్‌ను ముట్టడించారు. జిల్లాలోని బీజేపీ ముఖ్య నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌లకు తరలించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎక్కలదేవి మధు పట్టణ బీజేపీ అధ్యక్షులు నాయిని ప్రసాద్‌ల ఆధ్వర్యంలో నూతన కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కలెక్టరేట్‌లోకి వెళ్ళే ప్రయత్నం చేశారు. ఆందోళన కారులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మధు, ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తెలంగాణ సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు. డబుల్ బెడ్రూం ఇల్లు, గృహలక్ష్మి వంటి పథకాలు అర్హులకు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. దళితులకు మూడెకల భూమి ఇస్తానని చెప్పి మోసం చేశారని విమర్శించారు. దళిత బంధు, బిసి బంధు పేరిట ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల వాగ్దానాలు అమలు చేశాకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఓట్లు అడిగేందుకు రావాలన్నారు. హామీలు అమలు చేయకుండా ప్రజల్లోకి వస్తే అడుగడుగునా నిలదీస్తామని హెచ్చరించారు. బీజేపీ కలెక్టరేట్ ముట్టడి నేపథ్యంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయా సమస్యలపై కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలను అడ్డుకొని ఐడి కార్డు చూపితేనే లోపలికి పంపుతామనడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అలాగే జర్నలిస్టులను సైతం పోలీసులు అడ్డుకోవడం పట్ల జర్నలిస్ట్ సంఘాలు, మెదక్ ప్రెస్ క్లబ్ తీవ్రంగా ఖండించాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉదయ్, శివ, నిఖిల్, బెండ వీణ, మల్లేష్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది

కర్ణాటక ఎమ్మెల్యే సురేష్ శెట్టి

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్



తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే సురేష్ శెట్టి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ హవేలిఘనపూర్ మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని బీజేపీ కర్ణాటక ఎమ్మెల్యే సురేష్ శెట్టి ప్రారంభించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఈర్ల రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ మండల కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రభాస్ యోజన కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందు జనార్దన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాళ్లపల్లి రాజశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి నందా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి విజయ్, అసెంబ్లీ కన్వీనర్ ఇక్కడ దేవి మధుసూదన్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ కిరణ్, జిల్లా నాయకులు శ్రీపాల్, నరసింహారెడ్డి వడ్ల నవీన్ ప్రధాన కార్యదర్శిలు శ్రీనివాస్, సాయిబాబా ఉపాధ్యక్షులు రూపేందర్ శ్రీనివాస్, సిద్ధిరాములు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-నర్సాపూర్



శివంపేట మండల పరిధిలోని లచ్చిరెడ్డి గూడ గ్రామంలో ముగ్గురు బాధిత కుటుంబాలకు శివంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన కార్తీక్ పాముకాటుతో, మాలోత్ తీర్య అనారోగ్యంతో మృతి చెందగా మాలోత్ కుమార్‌కు యాక్సిడెంట్ అయి కాలు విరిగింది. ఈ మృతుల కుటుంబ సభ్యులతో పాటు, ప్రమాదంలో గాయపడిన బాధితుడిని జెడ్పీటీసీ మహేశ్ గుప్త పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం, నెలకు సరిపడు నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ రామ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తా

కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని ఈ ప్రాంత ప్రజలు ఆశీర్వదించాలని కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ మండల కేంద్రంలోని సిద్దేశ్వర ఆలయం, పొట్లపల్లి రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. హుస్నాబాద్ ప్రాంత ప్రజలకు సేవ చేయడానికి హుస్నాబాద్ అసెంబ్లీ అభ్యర్థిగా దరఖాస్తు చేసుకోవడానికి వెళుతున్నానని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి ధ్యేయంగా బహుజన బిడ్డగా ఒక్కసారి పార్లమెంట్ మెంబర్‌గా అవకాశం ఇచ్చిన మీ అందరికీ రుణపడి ఉంటనని చెప్పారు. తనకు ఇచ్చిన అవకాశానికి తెలంగాణ కోసం పార్లమెంటు సాక్షిగా పోరాటం చేసి సావు అంచుల వరకు పోయి వచ్చానన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించి హుస్నాబాద్ ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇవ్వాలని కోరారు.

సంతోషిమాత ఆలయంలో చైర్మన్ ప్రత్యేక పూజలు

నవ తెలంగాణ-హుస్నాబాద్ రూరల్



శ్రావణ మాసం వరలక్ష్మి వ్రత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత మహిళలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని మహిళలు పెద్ద సంఖ్యలో సంతోషి మాత ఆలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆలయాల్లో ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు

నవతెలంగాణ-నంగునూరు



శ్రావణమాసంలో రెండవ శుక్రవారం పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాల్లోని దేవాలయాలతో పాటు పాలమాకుల వెంకటేశ్వర ఆలయంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయాణ్ణే మహిళలు ఆలయాన్ని చేరుకొని వ్రతాలు నిర్వహించారు. ఈ వరలక్ష్మీ వ్రతాలు చేయడం వల్ల కుటుంబానికి దేవుని దీవెనలు ఎల్లకాలం ఉంటాయని మహిళల నమ్మకం. అనంతరం ఇరుగుపొరుగు మహిళలకు వాయినాలు అందించారు.

అవాలతో అద్భుతంగా లక్ష్మీదేవి చిత్రం

నవ తెలంగాణ- గజ్వేల్



వరలక్ష్మీ దేవి వ్రతం శుభ సందర్భంగా అవాలతో వినూతనంగా లక్ష్మీదేవి చిత్రాన్ని చిత్రించి శుక్రవారం నాడు రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు లక్ష్మీదేవి చిత్రాన్ని చిత్రీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రావణ మాసం అంతా కూడా భక్తులు భక్తి శ్రద్ధలతో భగవంతుణ్ణి పూజించుకుంటారన్నారు. శ్రావణ మాసం వరలక్ష్మీ దేవి వ్రతం పూజలో ప్రతి మహిళా కూడా పాల్గొని ఆ లక్ష్మీదేవి కరుణ కటాక్షాలు పొందుతారన్నారు. అవాల లక్ష్మీదేవి చిత్రాన్ని భక్తులు తిలకించి అద్భుతంగా ఉందని కొనియాడారు. భక్తుల సందర్శనార్థం 2రోజుల పాటు రామకోటి కార్యాలయంలో ఉంచబడునని తెలిపారు.

జర్నలిస్ట్ కుటుంబాన్ని పరామర్శించిన

డి డబ్లు జె ఎస్ జిల్లా అధ్యక్షుడు రాజలింగం

నవ తెలంగాణ- దౌల్తాబాద్



సాక్షి దినపత్రిక జర్నలిస్టు(దౌల్తాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మాజీ అధ్యక్షుడు) గొల్లపల్లి నగేష్ తండ్రి గొల్లపల్లి లింగయ్య గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న సిద్దిపేట జిల్లా డి డబ్ల్యు జె ఎస్ అధ్యక్షుడు జంగం రాజలింగం శుక్రవారం బాధ్యత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎర్ర నర్సింలు, బాలరాజ్ ,నరసింహులు, శంభు లింగం, మహేష్, గట్టు ప్రసాద్ పాల్గొన్నారు.

డాన్ బాస్కో పాఠశాల విద్యార్థుల భారీ ర్యాలీ



నవ తెలంగాణ-నర్సాపూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని డాన్ బాస్కో పాఠశాలకు చెందిన విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎన్జీవో కాలనీ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణంలోని పలు విధుల గుండా తిరుగుతూ హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ నర్సిరెడ్డి, ప్రిన్సిపాల్ మేఘన, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో రెండు అసిస్టెంట్ కుక్ పోస్టులు

నవతెలంగాణ-రామాయంపేట

రామాయంపేట పట్టణంలోని టీ ఎస్ మోడల్ స్కూల్‌లో రెండు అసిస్టెంట్ కుక్ (వంట మనిషి) పోస్టులు ఖాళీగా ఉన్నాయని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు. ఆరవ తరగతి పూర్తి చేసిన వారు అర్హులని ఆమె తెలిపారు. వేతనం నెలకు రూ. 6500 ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 26, 27 తేదీలలో రామాయంపేటలోని టీఎస్ మోడల్ స్కూల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

యువకులకు క్రీడా సామగ్రి అందజేత



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామానికి చెందిన యువకులకు ఎంపీటీసీ బెదురు తిరుపతి వాలీ బాల్ ఆట సామాగ్రిని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమంతుల వెంకటేశం, ఆయిల్ ఫామ్ జిల్లా సభ్యులు తిప్పని నాగేందర్, యువకులు నెల్లుట్ల రాజు, దోనే సాయి, కడవేరుగు సాయి, చింటూ, గోనెపల్లి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం



నవతెలంగాణ-తొగుట

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు ఆర్థిక సహకారం అందుతుందని సర్పంచ్ మెట్టు వరలక్ష్మి స్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్ద మసాన్ పల్లి గ్రామానికి చెందిన బ్రాహ్మణుల కనకవ్వ రూ.27,500 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశామన్నారు. ప్రమాదాల బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది రాంరెడ్డి, కోలా కనకయ్య గౌడ్, వార్డు సభ్యులు బాలకిషన్, కోలా విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



నవతెలంగాణ - సిద్దిపేట

ఒకరోజు కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా 26న రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు కోటి మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్ణయించిన మేరకు రంగనాయక సాగర్ వద్ద ఉన్న నర్సరీ లోని మొక్కలను అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి హరీశ్ రావు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మొక్కలు నాటే లక్ష్యంతో తవ్విన గుంతలు, నీటి కొరకు ఏర్పాటు చేసిన డ్రిప్స్ ను పరిశీలించి మొక్కలు, అవసరమైన ఇతర సామాగ్రిని సిద్ధం చెయ్యాలని, కార్యక్రమం విజయవంతం చేయుటకు తగు సూచనలు చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు పెద్ద ఎత్తున స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు అందరు కలిసి జిల్లాకు ఇచ్చిన లక్ష్యంని విజయవంతంగా కృషి చెయ్యాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమం వద్ద ఎలాంటి పిచ్చి గడ్డి లేకుండా చూడాలని , హాజరవుతున్న వారికి మంచి నీరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం హరితశుక్రవారం లో భాగంగా మున్సిపల్ నర్సరీ లో మొక్కలకు నీరు పట్టారు. నర్సరీ లో గల మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఐలయ్య, రంజిత్, అటవీశాఖ, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.నా

ఆసరాతో భరోసా



నవతెలంగాణ-బెజ్జంకి

తెలంగాణ రాష్ట్రంలోని వయో వృద్ధులు,ఒంటరి మహిళలు, వికలాంగులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అందజేస్తున్న ఆసరా భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక సత్యార్జునా గార్డెన్ యందు నూతన అసరా లబ్ధిదారులకు ధృవపత్రాలను, కల్యాణ లక్ష్మి చెక్కులను, జీవో 58 క్రమబద్ధీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే రసమయి అందజేశారు. ఎంపీపీ నిర్మల, జెడ్పీటీసీ కవిత, సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ శారధ పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

- కెనరా బ్యాంక్ మేనేజర్ హరీష్



నవతెలంగాణ-నంగునూరు

విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కెనరా బ్యాంకు మేనేజర్ హరీష్ అన్నారు. నంగునూరు మండలం పాలమాకుల, రాజగోపాల్ పేట, బద్దిపడగ పాఠశాలలో చదివే5 6వ 2,500చొప్పున అలాగే 7, 8, 9వ తరగతి చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు రూ.5 వేల చొప్పున కెనరా బ్యాంక్ విద్యా లక్ష్మి పథకం ద్వారా పాలమాకుల కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో ఉపకార వేతనాన్ని అందించడం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడే తల్లిదండ్రులకు విద్యను బోధించిన ఉపాధ్యాయులకు మంచి పేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులుతో పాటు కెనరా బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల తహసీల్దార్‌గా రాజేశ్వరరావు



నవతెలంగాణ-చేర్యాల

మెదక్ కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జోగినపల్లి రాజేశ్వరరావు శుక్రవారం చేర్యాల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. చేర్యాల తహసీల్దార్‌గా పనిచేసిన ఆరిఫా బేగం బదిలీపై గజ్వేల్ ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

ఉచిత ఓటర్ నమోదును సద్వినియోగం చేసుకోండి



నవతెలంగాణ-కొండపాక

ఉచిత ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ తెలిపారు. ఓటు హక్కు లేని ఉమ్మడి కొండపాక మండల 18 సంవత్సరాల నిండిన యువతి యువకులు ఉచిత ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల కోసం పనిచేసే నాయకులను మీ ఓటు ద్వారాఎన్నుకొని గ్రామాలను అభివృద్ధి అవినీతి లేని పాలన అందించే నాయకులను ఎన్నుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆధార్ కార్డు తండ్రి లేదా భర్త ఆధార్ కార్డు మూడు ఫోటోలు మీ ఫోన్ నెంబర్ కుక్కునూరు పల్లి మండల కేంద్రం బస్టాండ్ ఎదురుగా ఉన్న ఏకే ఇంటర్నెట్ సెంటర్లో అందిస్తే ఒక్క రూపాయి చెల్లించకుండా మీ ఓటర్ నమోదును ఉచితంగా నమోదు చేస్తారని తెలిపారు.

సోలిపేట చూపు కాంగ్రెస్ వైపు?

- ఎమ్మెల్యే అభ్యర్థిగా సోలిపేట కుటుంబానికి అవకాశం చేజారడంపై అసంతృప్తి
- సోలిపేట సతీష్ రెడ్డి రాజకీయ భవితవ్యం ఈ ఎన్నికలపైనే
- భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలి
- ఒత్తిడి చేస్తున్న సోలిపేట వర్గీయులు



నవతెలంగాణ-దౌల్తాబాద్

ప్రతిపక్షాలకు అంతు చిక్కకుండా కెసీఆర్ వేసిన ఎత్తుగడలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల ప్రకటన ఇప్పుడు దుబ్బాక నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. ముందస్తుగా పార్టీ అభ్యర్థులను ప్రకటించడం వల్ల జరిగే లాభం కంటే నష్టమే ఎక్కువనేది దుబ్బాక రాజకీయ సమీకరణలు చూస్తుంటే అర్థమవుతుంది. దుబ్బాక బీఆర్ఎస్ పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న సోలిపేట కుటుంబాన్ని కనీసం సంప్రదించకుండా ఎమ్మెల్యే అభ్యర్థిగా కొత్త ప్రభాకర్‌రెడ్డిని ప్రకటించడం పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. 2004 టీఆర్ఎస్ ఆవిర్భావం నుండి పార్టీలో ఉంటూ తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించి తనదైన శైలిలో దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన దివంగత మాజీ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి మరణానంతరం పార్టీ రెండుగా చీలిందని స్పష్టంగా కనబడుతుంది. రామలింగారెడ్డి మరణానంతరం వచ్చిన ఉప ఎన్నికల్లో దుబ్బాక సిట్టింగ్ స్థానాన్ని టీఆర్ఎస్ పార్టీ చేజారి పోవడమే దీనికి నిదర్శనం అని చెప్పవచ్చు. 2004 నుండి ఏకఛత్రాధిపత్యంతో టీఆర్ఎస్ పార్టీని నడిపిన రామలింగారెడ్డి బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటూ ప్రతిపక్ష పార్టీలను సైతం ఆత్మ రక్షణలో పడేసే విధంగా ఒకవైపు రాజకీయం మరోవైపు సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగారు. రామలింగారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నిరాధారణకు గురైన కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులు ఉప ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడం వల్లే సిట్టింగ్ సీటు కోల్పోయారని అందరికీ తెలిసిన విషయమే. దుబ్బాక ఉప ఎన్నికల అనంతరం మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా పోటీ చేయడం కోసం దుబ్బాకలో విస్తృతంగా పర్యటనలు చేస్తూ పార్టీ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఫలితంగా సోలిపేట కుటుంబానికి రోజురోజుకు పార్టీలో ప్రాధాన్యత తగ్గుతుందనే విషయం నియోజకవర్గ వ్యాప్తంగా చక్కర్లు కొట్టింది. పార్టీ నిర్వహించే కార్యక్రమాలకు సైతం సోలిపేట కుటుంబానికి సమాచారం లేకపోవడం పట్ల సోలిపేట వర్గం అసంతృప్తిగా ఉన్న విషయం తెలిసిందే. 2023 ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తానని నియోజకవర్గంలో సోలిపేట సతీష్ రెడ్డి, సుజాత ఆపదలో ఉన్న కార్యకర్తల కుటుంబాలను పరామర్శిస్తూ ఆర్థిక సహాయం అందజేస్తూ పర్యటనలు చేశారు. అనూహ్యంగా దుబ్బాక బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిని ముఖ్యమంత్రి కెసీఆర్ ప్రకటించడంతో సోలిపేట వర్గం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం రాకున్నా కనీసం నామినేటెడ్ పదవి అయినా సోలిపేట కుటుంబానికి ఇస్తారని ఎదురు చూశారు. సోలిపేట వర్గానికి చెందిన కార్యకర్తలు సోలిపేట సతీశ్ రెడ్డితో సమావేశమై ప్రత్యామ్నాయ ఆలోచనలు చేయాలని సూచించినట్లు తెలుస్తుంది. సతీష్ రెడ్డి రాజకీయ భవితవ్యం ఈ ఎన్నికపై ఆధారపడి ఉన్నదని ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఆయన వర్గీయులు ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. అభ్యర్థిగా కొత్త ప్రభాకర్ రెడ్డిని ఖరారు చేసినప్పటి నుండి సోలిపేట వర్గం మౌనంగా ఉండడం అనుమానాలకు తావిస్తున్నది. మొదటినుంచి హరీశ్‌రావు వర్గీయులుగా పేరు ఉన్న సోలిపేట కుటుంబం కార్యకర్తలు చెప్పినట్లు ప్రత్యామ్నాయ ఆలోచన చేస్తారా లేదా పార్టీలోనే కొనసాగుతూ కాంగ్రెస్ లేదా బీజేపీ అభ్యర్థులకు సహకరిస్తారా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది అనేది వేచి చూడాలి.

మరోమారు కేసీఆర్ పోటీ చేయడం గజ్వేల్‌కే గర్వకారణం

- గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్



నవతెలంగాణ -గజ్వేల్ : రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ముఖ్యమంత్రి కేసిఆర్ మరోమారు గజ్వేల్ నుండి పోటీ చేయడం ఈ ప్రాంతానికే గర్వకారణమని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధకునిగా 2014లో గజ్వేల్‌లో కేసిఆర్ అడుగుపెట్టిన రోజు నుండి ఈ తొమ్మిదేళ్లలో గజ్వేల్ అనూహ్య రీతిలో అన్ని రంగాల్లో విశేషమైన అభివృద్ధి కొనసాగుతున్నదని తెలిపారు. ఈ అభివృద్ధి పరంపర ఇదే విధంగా కొనసాగాలంటే అది కేవలం కేసిఆర్‌తోనే సాధ్యమన్నారు. కేసిఆర్ గజ్వేల్ నుండి ముఖ్యమంత్రి విజయం సాధించడం వల్లనే ఇవ్వాళ గజ్వేల్ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిందని దేశంలోని అనేక రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, అధికారులు గజ్వేల్ లో జరిగిన అభివృద్ధిని చూసేందుకు నిరంతరం తండోప తండాలుగా వస్తున్నారని అన్నారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా మాత్రమే కేసిఆర్ రెండు చోట్ల పోటీ చేస్తున్నారని తెలిపారు. రెండు చోట్లా భారీ మెజారిటీతో ప్రజలు కేసిఆర్‌ని ఆశీర్వదిస్తారని అన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉపేందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్ ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు నిజామొద్దీన్, శివకుమార్ పాల్గొన్నారు.

1న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-సిద్దిపేట

ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకులు కోరారు. శుక్రవారం పట్టణంలోని సంజీవిని పారా మెడికల్ కాలేజీలో నిర్వహించిన యు.ఎస్.పి.సి చలో హైదరాబాద్ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథులుగా యూఎస్ పి సి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు వై అశోక్ కుమార్, టి లక్ష్మారెడ్డి, ఎస్ రాజి రెడ్డి, పి రాజయ్య, ఎం సుధీర్‌లు హాజరై సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని-2020ని రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులకు , ఉద్యోగుల కొరకు పిఆర్సి కమిటీ వేయాలన్నారు. జులై 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలని, ప్రభుత్వం ప్రత్యేక చొరవతో ఉపాధ్యాయుల పదోన్నతుల , బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పండిట్, పి ఈ టీ లకు ప్రమోషన్ కల్పించాలని, డీఎస్సీ 2003 వారికి వెంటనే పాత పెన్షన్ వర్తింప చేయాలనే తదితర డిమాండ్లను పరిష్కరించాలన్నారు. సెప్టెంబర్ 1న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహించే మహాధర్నాకు సిద్దిపేట జిల్లాల్లోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్ కె వలిహమ్మద్, సి ఎచ్ విజేందర్ రెడ్డి, టీ రాజు రెడ్డి, టీ యాదగిరి, జి .శ్రీధర్, యస్.భాస్కర్ రెడ్డి, ఎస్ కనకయ్య, జె.అంజన్ కుమార్, డి మల్లయ్య, ఎం.కృష్ణ, కె. ప్రశాంత్ కుమార్, కే కనకరాజు, డి గిరిబాబు, టీ. శివలింగం, సత్యనారాయణ, మనీష్ కుమార్, వై వి సురేష్ కుమార్, పద్మయ్య, సక్రియ, రాజిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

- ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలి



నవతెలంగాణ-దుబ్బాక

నియోజకవర్గ కేంద్రమైన దుబ్బాకను రెవిన్యూ డివిజన్‌గా ప్రకటించాలని ఆ దిశగా ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని దుబ్బాక డెవలప్మెంట్ ఫోరం (డి.డి.ఎఫ్) అధ్యక్షుడు మాడబోయిన శ్రీకాంత్ కోరారు. శుక్రవారం దుబ్బాకలో వారు మాట్లాడారు. దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు అన్ని అర్హతలున్నా ప్రజా ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లలేకపోవడం బాధాకరమన్నారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి దుబ్బాక రెవిన్యూ డివిజన్ ఏర్పాటు కోసం ముఖ్యమంత్రిని ఒప్పించేలా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రెవిన్యూ డివిజన్ ఏర్పాటైతే సిద్దిపేట వలే దుబ్బాక కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. రెవిన్యూ డివిజన్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమయ్యేలా ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు, పట్టణ వాసులు, వ్యాపారస్తులు ప్రత్యేక చొరవ వహించాలని విజ్ఞప్తి చేశారు. డిడిఎఫ్ ప్రతినిధులు మర్గల రాజేష్, చారి, నరసింహులు, మహేష్, పలువురున్నారు

అశ్వరావుపేట ఆయిల్ పామ్ సాగు ఆదర్శం

- ఆయిల్ ఫామ్ తోటలను సందర్శించిన రైతులు. ప్రజా ప్రతినిధులు
- త్వరలో నర్మెట్ట ఆయిల్ ఫామ్ కర్మాగారం పనులు ప్రారంభం



నవతెలంగాణ-నంగునూరు

ఖమ్మం జిల్లా అశ్వరావుపేట ఆయిల్ ఫామ్ తోటలు, అప్పారావు పేట ఫ్యాక్టరీ చాల మంది రైతులకు ఆదర్శంగా నిలుస్తుందని మాజీ ఎంపీపీ శ్రీకాంత్ రెడ్డి, ఆయిల్ ఫామ్ రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డిలు అన్నారు. శుక్రవారం నంగునూరు మండలంలోని ప్రజా ప్రతినిధులు రైతులతో కలిసి అప్పారావుపేట, అశ్వరావుపేట లోని ఆయిల్ ఫామ్ తోటలను కర్మాగారాన్ని సందర్శించి సాగు వివరాలను ఆయిల్ ప్రాసెసింగ్ విధానం ఆయిల్ పేడ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి హరీశ్ రావు ప్రత్యేక కృషి మేరకు సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో రూ 247 కోట్లతో 65 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ ఫామ్ కర్మాగారం అత్యాధునిక విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకుంటుందని తెలిపారు. జిల్లాలో సాగు విస్తరించేందుకు ఇక్కడి తోటలను పరిశ్రమను పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఇక్కడి ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటుతో లాభదాయక పంటలైన ఆయిల్ ఫామ్ సాగు చేస్తే ఆర్థికంగా ఎదగనున్నారని తెలిపారు. రైతు ఒక్కసారి ఆయిల్ ఫామ్ సాగు చేస్తే 30 ఏళ్ల వరకు ఆదాయాన్నిస్తుందని తెలిపారు. రైతుఆదాయం పెరగడంతో పాటు ఆయిల్ ప్రాసెసింగ్, ప్యాకింగ్, మార్కెట్‌తో కలిపి ప్రత్యక్షంగా, పరోక్షంగా 400 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. మంత్రి హరీశ్ రావు కృషి ఫలితంగా భవిష్యత్తులో సిద్దిపేట జిల్లా కోనసీమగా మారే అవకాశం ఉందన్నారు. రైతుల సహకారంతో ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 9వేల ఎకరాల సాగు పూర్తి చేసుకున్న మని చెప్పారు. ఈ ఏడాది 17,800 ఎకరాల్లో సాగును పెంచాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దిపడగ కిష్టారెడ్డి, సోసైటి చైర్మన్ కోల రమేశ్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాగుల సారయ్య, రైతులు రంగు రాజు గౌడ్, రేకులపల్లి వెంకట్ రెడ్డి, సనాదుల బాల పోచయ్య, మధు, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్టాప్ టాలరెన్స్ నూతన పుస్తకం ఆవిష్కరణ



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌లో ఆర్యవైశ్య యువనాయకుడు బెల్దే మణికంఠ రచించిన స్టాప్ టాలరెన్స్ అనే పుస్తకాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ యాదవరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు వినూత్న ఆవిష్కరణల వైపు మొగ్గు చూపాలని అదే బాటలో బెల్దె మణికంఠ చిన్న వయసులో పుస్తకాన్ని రచించి సమాజానికి అందించడం శుభసూచకమన్నారు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక గొప్పతనం ఉంటుందని దానిని పసిగట్టి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అలాగే స్టాప్ టాలరెన్స్ పుస్తక రచయిత బిల్దే మణికంఠ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సహనంతో ఉండాలని సహనం వల్ల అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటాయని జీవితం ఆనందంగా ఉంటుందని పుస్తకంలో మానవ మనుగడ కోసం మానవాళికి ఉపయోగకరమైన విశేషాలు ఉన్నాయని ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం స్టాప్ టాలరెన్స్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోపాల్ రెడ్డి, పద్మశాలి సంఘం గజ్వేల్ ప్రజ్ఞపూర్ పట్టణ అధ్యక్షులు దుర్గాప్రసాద్, జగదేవ్‌పూర్ మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు రాచర్ల నరేష్ పాల్గొన్నారు

బీపీ మండల్ చేసిన సేవలు మరువలేనివి

- యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్



నవతెలంగాణ-మద్దూరు

బీహార్ మాజీ ముఖ్యమంత్రి బీపి మండల్ చేసిన సేవలు మరువలేనివని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా దూల్మిట్ట మండల కేంద్రంలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి బీపి మండల్ 105వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీపీ మండల్ 12 అంశాలు సూచించారని అంశాలలో, కేంద్ర సర్వీసుల్లో 52% రిజర్వేషన్ కల్పించాలని నివేదిక అందజేస్తే కేవలం 27% రిజర్వేషన్ మాత్రమే అమలు చేస్తున్నారని, మిగితా అంశాలను వెంటనే అమలు చేయాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు. పేరుకు 27% అని చెప్తున్నా వాస్తవంగా అన్ని శాఖలలో 16% మాత్రమే ఉద్యోగులు ఉన్నారన్నారు. అలాగే బీసీలు సామాజిక, విద్య, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే చట్ట సభలలో జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలన్నారు. అప్పటివరకు బీసీలందరు ఐక్యంగా పోరాడాలని అప్పుడే మన లక్ష్యం దిశగా అడుగులు ముందుకు వేయవచ్చని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బెక్కల్ సర్పంచ్ కూకట్ల బాలరాజు యాదవ్, ఉపసర్పంచ్ బాలయ్య, జెల్ల శ్రీనివాస్, దిలీప్, వెంకటేష్, సాగర్, నరేష్, పరుశరాములు, సంపత్, నరేష్, అనిల్, బ్రహ్మచారి, చంద్రయ్య, రాజు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే గ్రామాల అభివృద్ధి



నవతెలంగాణ-గజ్వేల్

గ్రామాల అభివృద్ధి ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమని గజ్వేల్ మండలం భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు బెండ మధు, సీనియర్ నాయకులు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ మండలం సింగాటంలో గ్రామ పంచాయతీ భవనానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత గజ్వేల్ మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. పంచాయతీ భవన నిర్మాణానికి భూమిని దాతలు దివంగత గణపతి టేకుమల్ల రాధాకిషన్‌రావు, రాధాబాయ్ అమ్మ స్మారకార్థం వారి కుమారులైన టేకుమల్ల భూపతి రావు, శ్రీధర్ రావు, గోపాల్ రావు, రాజేశ్వరరావు వారి కుమారులు పురుషోత్తం రావు, కుమార్తెలు విరాళంగా ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ నాగేందర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు .బుచ్చిరెడ్డి, పార్టీ నాయకులు, తాటికొండ సంజీవరెడ్డి, గున్నల కృష్టారెడ్డి, రవీందర్ రెడ్డి, ములుగు మల్లేశం, అందోల్ మల్లేశం, ప్రహ్లాద్ గౌడ్, స్వామి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సిద్దిపేట అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం గూడూరి శ్రీనివాస్ దరఖాస్తు



నవతెలంగాణ-సిద్దిపేట

టీపీసీసీ చేనేత విభాగం ఛైర్మెన్ గూడూరి శ్రీనివాస్ సిద్దిపేట అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్‌కు దరఖాస్తు అందచేశారు. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన గూడూరి శ్రీనివాస్ గత 25 ఎండ్లుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సిద్దిపేట మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. సిద్దిపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పని చేశారు. నియోజవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. గత పదేండ్లు గా పిసిసి చేనేత విభాగం ఛైర్మెన్ గా పనిచేస్తూ.. పద్మశాలీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేశారు. సిద్దిపేటలో సైతం పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వారు అధికంగా ఉండటం ఆయనకు కలిసివచ్చే అవకాశం వుంది. కాంగ్రెస్ అధిష్టానం సైతం గూడూరు శ్రీనివాస్ కు మొగ్గు చూపే అవకాశం ఉందిని తెలుస్తున్నది. ఈ సదర్భంగా గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు కాంగ్రెస్ టికెట్ లభించే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. తనకు అవకాశం వస్తే పార్టీ విజయానికి కృషి చేస్తా అన్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి, విధేయుడు గా పనిచేస్తా నని హామీ నిచ్చారు.

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి



నవతెలంగాణ-బెజ్జంకి

దళిత బంధు, గృహలక్ష్మి పథకాలను త్వరితగతిన అమలులు చేసి అర్హులకందజేతలో పారదర్శకత పాటించాలని బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీనివాస్ శుక్రవారం విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ ఇండ్లను అనర్హులకు అందజేశారనే విమర్శలు ప్రజల్లో వ్యక్తమయ్యాయని మళ్లీ అదే రీతిగా దళిత బంధు, గృహలక్ష్మి పథకాల్లో బీఆర్ఎస్ శ్రేణులకు ప్రథమ ప్రాధాన్యత కల్పించుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం పథకాలు అమలు చేయాలని, పార్టీ శ్రేణులకు కాదని, ప్రభుత్వాన్ని ఎన్నుకుంది ప్రజలేనని, పార్టీ శ్రేణులు కాదనే విషయాన్ని మర్చిపోవద్దని స్థానిక ప్రజాప్రతినిధులకు శ్రీనివాస్ హితవు పలికారు.

ఆయిల్ పామ్ సాగు రైతులకు శిక్షణ



నవతెలంగాణ-మర్కుక్

సంప్రదాయం నూనె గింజల కన్నా ఆయిల్ పామ్ పంట నూనె దిగుబడి 4 నుంచి 5 రేట్లు అధికంగా ఉంటుందని మర్కుక్ మండల వ్యవసాయ అధికారి డా. టి. నాగేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చేబర్తి గ్రామానికి చెందిన రైతు, వంటి మామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాందాస్ గౌడ్ సాగు చేసిన అయిల్ ఫామ్ పంటల ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిల్ పామ్ మొక్కలు నాటిన తరువాత 4వ సంవత్సరం నుంచి కాపు మొదలై 30 సంవత్సరల వరకు నిరంతర దిగుబడితో ఆదాయం పొందవచ్చన్నారు. ఆయిల్ పామ్ సాగులో రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడిని రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఆయిల్ పామ్ సాగు కి డ్రిప్ 90 శాతం రాయితీ, మొక్కలను రాయితీలను ప్రభుత్వం అందజేస్తుందని, రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటలుగా వరి, చెరుకు, పండ్ల తోటలు తప్ప అన్ని పంటలు వేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రజినీకాంత్, విష్ణు, రైతులు, తదితరులున్నారు.


బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్



నవతెలంగాణ- గజ్వేల్

విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్ల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు బీపీ మండల్ అని బీఎస్పీ నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు గూడూరి కర్ణాకర్ అన్నారు. పట్టణంలోని టీవైఆర్ సెమినార్ హాల్లో బిపి మండల్ కు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కర్ణాకర్ మాట్లాడుతూ 1990 సంవత్సరంలో చిరు దీపంలా వెలుగులు నింపిన వ్యక్తి బిసి రిజర్వేషన్ల పితామహుడు బి.పి మండల్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కటికల ఓం ప్రకాష్, అతిథులుగా నియోజకవర్గం ఇంచార్జులు కేతోజి వినోద్, కొండనొల్ల నరేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉప అధ్యక్షుడు ఎల్లం, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కానుగుల రమణాకర్, కోశాధికారి మొండి కర్ణాకర్, కార్యదర్శి కోట మహేందర్, ఈసి మెంబర్ ఆశాని కనక ప్రసాద్, సోషల్ మీడియా కన్వీనర్ నరేష్ పాల్గొన్నారు.

వెంకటేశ్వరాలయంలో హైకోర్టు జడ్జి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం హైకోర్టు జడ్జి చాడ విజయభాస్కర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్ హైకోర్టు జడ్జి చాడ విజయభాస్కర్ దంపతులకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. వారు మాట్లాడుతూ నిత్య పూజలు అందుకుంటున్న శ్రీ వెంకటేశ్వర ఆలయ నిర్మాణం దుబ్బాకతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక ఆధ్యాత్మిక శోభను సంతరించుకుందన్నారు. దుబ్బాక ఖ్యాతిని పెంచేలా శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణం ఉందని కితాబిచ్చారు. ఆధ్యాత్మిక చింతన, భక్తి భావాన్ని పెంపొందించుకోవడం ద్వారా మానసిక ప్రశాంతతను పొందగలుగుతారన్నారు. ఆలయ కమిటీ సభ్యులు రొట్టె రాజమౌళి, ఆకుల దేవేందర్, చింతరాజు, అర్చకులు, పలువురున్నారు.

తెలంగాణ కవులకు బాటసారి సురవరం



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ కవులకు దిక్సూచిగా ముందు నిలిచి వారి రచనలను వెలుగులోకి తీసుకువచ్చి బాట చూపించిన మహనీయులు సురవరం ప్రతాపరెడ్డి అని బాలసాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశం అన్నారు. సురవరం ప్రతాప్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సిద్దిపేటలో జరిగిన కార్యక్రమంలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కవులే లేరనే నిందావ్యాఖ్యలను సవాలుగా తీసుకొని 354 కవులతో కూడిన "గోల్కొండ కవుల సంచిక" గ్రంథాన్ని కవుల జీవిత విశేషాలతో సహా ప్రచురించి గ్రంథరూపంలోనే సమాధానమిచ్చిన వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి అని అన్నారు. ప్రతాపరెడ్డి రచించిన ఆంధ్రుల సాంఘిక చరిత్ర రచనకు గాను "కేంద్ర సాహిత్య అకాడమి" అవార్డు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట కవులు బస్వ రాజ్ కుమార్, కోణం పర్శరాములు, రాచకొండ భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి సతీష్ కుమార్ గౌడ్ దరఖాస్తు



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సిద్దిపేటకు చెందిన మార్క సతీష్ గౌడ్ గాంధీభవన్‌లో శుక్రవారం దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గతంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రస్తుత మేనిఫెస్టో ద్వారా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేసారు. రాష్టంలో అధికార పార్టీ చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలే పార్టీని గెలిపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్ యాదవ్, పర్శరాం, సాయి కుమార్, జయంత్, నర్సయ్య, ప్రశాంత్, నాగరాజు, రాకేష్, సుధీర్, బ్రాహ్మం, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌లోని మహంకాళి అమ్మవారి ఆలయంలో శుక్రవారం శ్రావణ మాసం సందర్భంగా కౌన్సిలర్ బాలమని శ్రీనివాస్‌రెడ్డి మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహంకాళి అమ్మవారి ఆశీర్వాదంతో అందరూ బాగుండాలని కోరిన కోర్కెలు నెరవేర్చే భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న మహంకాళి అమ్మవారి దేవాలయం లో శ్రావణమాస పూజలు కొనసాగుతున్నాయని అమ్మని దర్శించిన వారికి సకల సౌభాగ్యాలు కలుగుతాయని అన్నారు.

పరిమితికి మించి ప్యాసింజర్లను తీసుకెళ్లొద్దు

- హుస్నాబాద్ సీఐ ఎర్రల్ల కిరణ్





నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

పరిమితికి నుంచి ఆటోలో ప్యాసింజర్లను తీసుకెళ్లేదని సీఐ ఎర్రల్ల కిరణ్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్, సిద్ధిపేట జాతీయ రహదారిపై సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తున్న ఆటోని బంజారుపల్లి స్టేజి వద్ద ఆటో ఆపి హుస్నాబాద్ సీఐ కిరణ్ ఆటో డ్రైవర్‌కు ప్రయాణికులకు రోడ్డు ప్రమాదాల గురించి ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే కుటుంబాలు మొత్తం రోడ్డున పడతాయని సూచించారు. ఆటో కెపాసిటీ ప్రకారం ప్రయాణికులు ప్రయాణించాలని అంతకుమించి ఎక్కితే ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. కుటుంబంలో ఒక వ్యక్తి చనిపోతే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ అది గమనించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ఆటోలు నడపాలని సూచించారు. ఆటోలో 14 మందిని ఎక్కించుకోవడం చాలా ప్రమాదమని ప్రయాణికులు కూడా అంతమంది ఎక్కవద్దని సూచించారు. సామర్థ్యానికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకునే వారిపై కూడా చట్టపరమైన చర్య తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు మరమ్మతులకు నిధులు ఇవ్వండి సార్

నవతెలంగాణ-దౌల్తాబాద్

మండల పరిధిలోని శేరుపల్లి బందారం గ్రామపంచాయతీ పరిధిలోని మధిర గ్రామమైన నర్సంపేట గ్రామ శివారులోని రోడ్లు గుంతలమయంగా మారాయి. మహాత్మ జ్యోతిరావు భాపూలే సాంఘిక సంక్షేమ వెనుకబడిన గురుకుల పాఠశాల (బాలికల) మొండి చింత నుంచి కోనాపూర్, మహమ్మద్ షాపూర్, ఇందుప్రియాల్, మాచినపల్లి మీదుగా మెదక్ జిల్లా తూప్రాన్ మండల పరిధిలోని కోనయపల్లి , సిద్దిపేట జిల్లా వర్గల్ మండల పరిధిలోని నాచారం గుట్ట వరకు ఆర్ అండ్ బీ రోడ్డు మొత్తం గుంతలమయమైంది. ఎనిమిది గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు మరమ్మత్తు పనులకు నిధులను మంజూరు చేయాలని ఎంపీపీ గంగాధరి సంధ్య రవీందర్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రణం శ్రీనివాస్ గౌడ్‌లు ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిని కోరారు. ఈ మేరకు ఎంపీ స్పందిస్తూ ఆర్ అండ్ బి రోడ్డు బిటి రెన్యువల్ అయ్యిందని చెప్పి పంచాయతీ రాజ్ ఎస్ఈ కి చరవాణి ద్వారా మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ మండల రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు స్టీవన్ రెడ్డి, దౌల్తాబాద్ మండల సర్పంచ్ గౌరవ అధ్యక్షులు




ధార సత్యనారాయణ, నాయకులు కుమార్, మామ షాపూర్ సర్పంచ్ భర్త కామెడి పూర్ణయ్య, వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ సభ్యులు నీరుడి సత్యనారాయణ, తిరుమలాపూర్ మాజీ సర్పంచ్ సర్వ గారి యాదవ రెడ్డి రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాలకు పూర్వ వైభవం

- ఆరు దేవాలయాల అభివృద్ధి రూ.1.98 కోట్లు మంజూరు చేసిన మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-సిద్దిపేట: సిద్దిపేట నియోజకవర్గంలో పలు ఆలయాలకు నిధులు మంజూరు అయినట్లు, ఆరు దేవాలయాల అభివృద్ధికి కోటి 98 లక్షల 50 వేలు నిధులు మంజూరయ్యాయని మంత్రి హరీశ్ రావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ధార్మిక దార్శనికుడని, రాష్ట్రంలో అనేక దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



చేస్తుందన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో ఇప్పటికే 50కి పైగా ఆలయాలు అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. అదే తరహాలో నియోజకవర్గంలో కొత్తగా మరో ఆరు దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసుకున్నామని చెప్పారు. చిన్నకోడూర్ మండలం సలేంద్రి గ్రామంలో అతి పురాతన ప్రాచీన ఆలయం శ్రీ శివాలయం (రామలింగేశ్వర)కు రూ.50 లక్షలు, విఠలాపూర్ గ్రామంలోని ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన గుట్ట పై వెలిసిన శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయంకు రూ.42 లక్షలు, నారాయణ రావు పేట మండలంలోని పురాతన శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంకు రూ.39 లక్షలు , సిద్దిపేట పట్టణంలోని శ్రీ పెద్దమ్మ దేవలయం అభివృద్ధికి రూ.30 లక్షలు, హనుమంతు పల్లి ఇరుకోడ్ లోని పెద్దమ్మ ఆలయం మిగులు పనులకు రూ.20 లక్షలు, సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో ని శ్రీ మహంకాళి దేవాలయంకు రూ.17.50 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. త్వరలోనే టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ఎన్ఎస్‌యూఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా అజ్మత్

నవతెలంగాణ-సిద్దిపేట

ఎన్ఎస్‌యూఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా అజ్మత్‌ని నియమిస్తూ జాతీయ ఎన్ఎస్‌యూఐ కార్యదర్శి, రాష్ట్ర ఇంచార్జి అక్షయ్ లక్ర, రాష్ట్ర అధ్యక్షుడు బలమూరి వెంకట్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పూజల హరి కృష్ణ అజ్మత్‌ను ఘనంగా సన్మానించాడు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ వైస్ చైర్మన్ కలిమోద్దీన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి గోపి కృష్ణ, ప్రీశరీష్, గౌటి బబేస్, మహిపల్ రెడ్డి, కనకయ్య, వహబ్, ప్రతాబ్ సాయి, బబ్బు, ఖాజా పాషా, అజ్మత్ అలీ, అద్నాన్, అనీల్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

రాకేష్ యాదవ్‌కు సన్మానం

ఎన్ఎస్‌యూఐ సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షునిగా నియామకం అయిన రాకేష్ యాదవ్‌ను ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కో-ఆర్డినటర్ దాసరి రాజు, టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొలను నరేష్ శుక్రవారం సన్మానించారు. రాజు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పైన పోరాటం చేస్తూ, పేద విద్యార్థులకు



అండగా నిలవాలని సూచించారు. రాష్ట్ర కమిటీ సూచనల మేరకు కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు

ప్రభుత్వ ఇంటర్ విద్యను పరిరక్షిద్దాం

- టీజీఎల్ఏ రాష్ట్ర అధ్యక్షులు గాదె వెంకన్న

నవతెలంగాణ-జగదేవపూర్

తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ ప్రాథమిక సభ్యుల సమావేశం జగదేవపూర్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గాదె వెంకన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే పేద విద్యార్థులకు నాణ్యమైన ఇంటర్ విద్యను అందించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లను పెంచే విధంగా కృషి చేద్దామన్నారు. గతంలో కేసీఆర్ ఇచ్చి మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేయడం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గెజిటెడ్ స్థాయి ఉద్యోగులను క్రమబద్దికరించిన చరిత్ర కేవలం సీఎం కేసీఆర్‌కే



దక్కుతుందన్నారు. త్వరలోనే క్రమబద్ధీకరణ కానీ అధ్యాపకులకు ఉత్తర్వుల వచ్చే అవకాశం ఉందని వారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్ట్ క్రమబద్ధీకరణ కొరకు కృషిచేసిన గాదె వెంకన్నను ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సమావేశంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ వాడకట్టు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు బచ్చలకూర గోవర్ధన్ కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు లవ కుమార్, స్వామి, శేకర్, మోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరలక్ష్మి వ్రతాలు

నవతెలంగాణ - సిద్దిపేట

పట్టణంలోని సంతోషిమాత దేవాలయంలో వరలక్ష్మి శుక్రవారం సందర్భంగా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజలను, హెూమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నవీన్ కుమార్ మాట్లాడుతూ వరలక్ష్మి వ్రతం సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి దర్శనానికి రావడం జరిగిందని తెలిపారు. ప్రత్యేకంగా కుంకుమ పూజలు, హెూమం నిర్వహించడం జరిగిందన్నారు. ఓడి బియ్యం సమర్పించారని, వచ్చిన భక్తులందరికీ అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఛైర్మెన్ కాచం కాశీనాథ్, తమ్మిశెట్టి వీరేశం, బచ్చు రమేశ్, ధర్మకర్తలు గాదగొని సత్యం గౌడ్, కాముని ప్రభాకర్, చకిలం అమర్నాథ్, కొమరవెల్లి కళ్యాణి, ఎక్స్ అఫిషియో సభ్యుడు శాకం మధుసూధన్ రావు, గరిపల్లి సువర్ణ, అర్చకులు రామకృష్ణ, మాజీ ధర్మకర్తలు చింత సంతోష్ కుమార్, గందె మాధురి, సొప్పదండి రాము, సిబ్బంది శంకర్, వాసు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి సహిత లలితా పరమేశ్వరి దేవాలయంలో....

శ్రీశ్రీశ్రీ అష్టలక్ష్మి సహిత లలితా పరమేశ్వరి



దేవాలయంలో వరలక్ష్మి వ్రతం సందర్భంగా శ్రీ లలితా పరమేశ్వరి అమ్మవారికి, అష్టలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.. సామూహిక కుంకుమార్చనలు, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కృపాకర్చార్యులు, వెంకటాచార్యులు, ఆలయ నిర్వహకులు జి కిరణ్ కుమార్, భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వం బీసీల కులగణన చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ 105వ జయంతి సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్ ఆధ్వర్యంలో బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా బీరయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఐఏఎస్, ఐపీఎస్ గ్రూప్ వన్ కేంద్ర సర్వీసుల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లకు కృషి చేసిన స్ఫూర్తిదాత అని అన్నారు. మిగిలిన 39 మండల్ కమిషన్ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని, దేశంలో ఉన్న 75 కోట్ల జనాభా కలిగిన బిసిల కులగనన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ అధ్యక్షులు రాహుల్, బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం, విద్యార్థి నాయకుడు అఖిల్, యువజన నాయకుడు అంజద్, రఘు, ప్రేమ్, గణేష్, కార్తీక్, విట్టల్, రామ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓటాబంధుదారులకు డబ్బులు కట్టలేక.. వీఆర్ఏ వ్యక్తి ఆత్మహత్యాయత్నం



నవతెలంగాణ-దౌల్తాబాద్

మండల పరిధిలోని దీపాయంపల్లి గ్రామానికి చెందిన మస్కూరి నగేష్ గ్రామంలో వీఆర్ఏ అసలుదారుడిగా ఉన్నాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో విధులు నిర్వహి స్తున్న వీఆర్ఏ అసలుదారులను క్రమబద్ధీకరణ చేస్తూ వివిధ శాఖల్లోకి సర్దుబాటు చేయగా.. నగేశ్ వ్యవసాయ శాఖలో కార్యాలయంలో సబార్డినేట్‌గా ఉద్యోగం పొందాడు. అయితే గ్రామంలోని వీఆర్ఏ ఓటాబందుదారులకు రూ.55 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నాడు. డబ్బులు చెల్లించే వాయిదా ఆగస్టు 26న ఉన్నందున.. డబ్బులు సర్దుబాటు కాక పోవడంతో గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు గమనించి వైద్యం కోసం 108 వాహనం ద్వారా గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం నగేష్ ప్రాణపాస్థితిలో మృత్యువుతో పోరాడుతున్నాడు .

28న జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని బాలుర ప్రభుత్వోన్నత పాఠశాలలో ఈనెల 28న అండర్-14, 17 జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ పావని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28,29న మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులు వారి విద్యా ర్థులను విధిగా హజరయ్యేల చొరవచూపాలని.. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ నెలలో జరిగే జిల్లాస్థాయి క్రీడల్లో పాల్గొంటారని ఎంఈఓ తెలిపారు. వివరాలకు 9449453619 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ పట్టణంలో ఇటీవల నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌కు లబ్ధిదారులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. లబ్ధిదారులకు కేటాయించి రోజులు గడుస్తున్నా.. ఇడ్లు ఇవ్వడం లేదన్నారు. అధికారులు స్పందించి వెంటనే డబ్బులు బెడ్ రూమ్ ఇండ్లను అందించాలని కోరారు.

ఉన్నతంగా ఆలోచించండి

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్కైరూట్ సీఈవో పవన్ ఉద్బోధ
- ఘనంగా ముగిసిన గీతం స్మార్ట్ ఐడియా థాన్
- విజేతలకు నగదు పురస్కారం



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఔత్యాహిక పారిశ్రామికవేత్తలు ఎల్లవేళలా ఉన్నతంగా ఆలోచించాలని, అత్యధిక ప్రభావం చూపే సమస్యలను పరిష్కరించి సమాజం మెప్పు పొందినప్పుడు ప్రపంచ మద్దతు లభిస్తుందని స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) పవన్ చందన అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ప్రాంగణంలో గీతం స్మార్ట్ ఐడియా థాన్-2023 మూడవ విడత పోటీల (అత్యుత్తమ ఆవిష్కరణలు చేసిన విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమం) ముగింపు ఉత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్టార్టప్ ఇండియా, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎమర్జింగ్ మార్కెట్స్ (సీఈఎం), బోస్టన్లోని నార్త్ ఈస్టన్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ ఎడ్యుకేషన్ (ఎన్ఎయూసీఈఈ)ల సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆయన కీలకోపన్యాసం చేశారు. గతంలో స్టార్టప్లను ప్రజలు అంతగా విశ్వసించే వారు కాదని, కానీ కొన్ని విజయవంత గాథలు వింటున్న ఈ తరుణంలో వాటిపై సానుకూలత పెరిగిందన్నారు. స్టార్టప్లలో చాలా విఫలమైనా, అపజయాలు లేకుండా విజయం సాధించలేరంటూ, వైఫల్యాలకు వెరవకుండా లక్ష్యించిన గమ్యాన్ని చేరుకో వాలని సూచించారు. ఏ వ్యాపారం రాణించాలన్నా మౌలికాంశాలపై పట్టు తప్పనిసరి అని, రిలయన్స్ వ్యవస్థాపకుడు ధీరూభాయ్ అంబానీకి ఆ లక్షణాలు పుష్కలంగా ఉండబట్టే అంతగా రాణిస్తున్నారని ప్రశంసించారు. వ్యవస్థాపకులుగా ఎదగడం ఉత్తమ కెరీర్ ఎంపికగా తాను భావిస్తానన్నారు.రెండేళ్ల క్రితమే అంత రిక్ష రంగంలో పోటీపడడానికి అందరినీ కేంద్ర ప్రభు త్వం అనుమతించిందని, వచ్చే పదేళ్లలో ఆ రంగానికి మంచి భవిష్యత్తు ఉంటుందని పవన్ ఆశాభావం వ్యక్తపరిచారు. కోట్లాది మంది ప్రజల ప్రయోజనాలతో కూడుకున్న అంతరిక్ష రంగంలో కెరీర్ ఎంపిక చేసుకోవాలని సూచించారు. వచ్చే 15 ఏళ్లలో ప్రపంచంలోని 50 శాతం శాటిలెట్ బ్రాడ్బ్యాండ్లో కలుపుతారని, ఉపగ్రహం నుంచి నేరుగా టీవీ కార్యక్రమాలను వీక్షిస్తున్నట్టు ఇకమీదట ఇంటర్నెట్ సదుపాయాన్ని కూడా పొందొచ్చని చెప్పారు. స్పేస్ఎక్స్, వన్వెబ్, మారుతీ ఎయిర్టెల్ వేలాది ఉపగ్రహాలను ఇప్పటికే నింగిలోకి పంపాయని, మరిన్ని ఉపగ్రహాలు నిర్మాణ దశలో ఉన్నాయని, వీటిద్వారా మనదేశంలోని 50 శాతం జనాభా ఈ సదుపాయం లభిస్తుందన్నారు. స్కైరూట్ ఎదిగిన క్రమాన్ని వివరిస్తూ, ఏడంతస్తుల ఎత్తుగల రాకెట్ ప్రస్తుతం నిర్మాణంలో ఉందని, బహుళ ఉపగ్రహాలను కక్ష్యలోని ప్రవేశపెట్టగలదని సీఈవో చెప్పారు. వ్యక్తుల నేపథ్యం, జ్ఞానం, అనుభవం, లింగభేదంతో సంబంధం లేకుండా ప్రతిభకు ప్రాధాన్యమిస్తూ తమ ఉద్యోగులను ఎంపిక చేస్తున్నామన్నారు. ఆకాశమే హద్దుగా ఔత్సాహిత పారిశ్రామికవేత్తలు ఎగదాలంటూ, గీతం స్మార్ట్ ఐడి యా థాన్ విజేలతను ఆయన అభినందించారు. సభా ధ్యక్షత గీతం అధ్యక్షుడు ఎం. శ్రీభరత్ మాట్లాడుతూ.. స్కైరూట్ గత ఆరేళ్లలో దాదాపు 500 కోట్ల రూపాయల నిధులను సమీకరించగలిగిందని, ఇంత పెద్ద మొత్త ంలో మరే స్టార్టప్ నిధుల సేకరణ చేయలే దన్నారు. గీతమ్‌లోని వెంచర్ డెవలప్మెంట్ సెంటర్ (వీడీసీ) నిర్వహిస్తున్న వ్యవస్థాపకుడికి పరిచయ కోర్సు విద్యార్థులంతా వినియోగించుకోవాలని వర్ధమాన ఇంజ నీర్లకు సూచించారు. మన చుట్టూ ఉన్న సమస్యలపై విమర్శనాత్మకంగా ఆలోచించడం, ప్రశ్నిం చడం, తగిన పరిష్కారాలు చూపించే ఉత్సుకతను పెంపొందించు కోవడం వంటివి ప్రతి ఒక్కరూ చేయా లన్నారు. స్టార్టప్ ఇండియా సీనియర్ మేనేజర్ డాక్టర్ సురభి గుప్తా ఆ సంస్థ అందిస్తున్న సేవలను వివరించగా, గీతం చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ (సీఐవో) కార్యక్రమ ఇతివృత్తాన్ని వివరించారు. తొలుత, వీడీసీ డైరెక్టర్ శ్రీదేవి దేవిరెడ్డి అతిథులను స్వాగతించి, కార్యక్రమ లక్ష్యాలను వివ రించారు. అమెరికాలోని బోస్టన్లో ఉన్న నార్త్ ఈస్టన్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ గ్రెగ్ కొలియర్, ప్రొఫెసర్ రవి రామమూర్తి స్టార్ట్ ఐడియా థాన్-2023 ఫలితాలను వెల్లడించి, విజేతలను సత్కరించారు. న్యూస్అప్ టెక్ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు స్టార్ట్ ఐడియా థాన్ విజేతలుగా నిలిచి రెండు లక్షల రూపా యల నగదు పురస్కారాన్ని, పాలిప్యూయలర్ వ్యవస్థకు లు ద్వితీయ బహుమతిగా లక్ష రూపాయలు, ఆగ్రోడ్రా యిడ్ సమాజంపై ప్రభావం చూపే ఆలోచన నిలిచి 50 వేల రూపాయలు, ఉత్తమ మహిళా వ్యవస్థాపకులుగా కోయాక్ట్ బృ ందం నిలిచి రూ.50 వేలు గెలుచుకోగా, లెబెన్ జాన్సన్ పీపుల్స్ ఛాయిస్ అవార్డును మెడీ క్యాండీ గెలుచుకుని రూ.50 వేల నగదు పుర స్కారాన్ని అందుకుంది. వారికి గీతం ఖర్చుతో రెండు వారాల పాటు బోస్టన్లో నిర్వహించనున్న శిక్షణకు పంపనున్నారు.

బ్రహ్మణ సంఘం మండలాధ్యక్షుడిగా సుధాకర్

నవతెలంగాణ-జహీరాబాద్

బ్రాహ్మణ సమాజం జహీరాబాద్ మండలాధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జిల్లా అధ్యక్షులు రామారావు దేశ్పాండే తెలిపారు. జహీరాబాద్ మండల బ్రాహ్మణ సంఘానికి అధ్యక్షుడిగా షాపూర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ జోషి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జహీరాబాద్ పట్టణంలోని రాం మందిర్‌లో శుక్రవారం జరిగిన ఎన్నికల కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు రామారావు దేశ్ పాండే, జిల్లా కోశాధికారి కిషన్ రావు బక్షిలు పరిశీలకులుగా వ్యవహరించారు. కాగా మండల బ్రాహ్మణ సంఘానికి గౌరవ అధ్యక్షులుగా శంకర్రావు బసంతపూర్, అసోసియేట్ అధ్యక్షులుగా పునీత్ దీక్షిత్, అధ్యక్షులుగా కే.సుధాకరరావు షాపూర్, ఉపాధ్యక్షులుగా సురేష్ కుమార్ పట్వారి, అక్షయ దేశ్పాండేలు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ జోషి, సంయుక్త కార్యదర్శులుగా సురేష్ బూచినెల్లి, రాజ్ కుమార్ దేశ్ముఖ్, కోశాధికారిగా దేవిదాస్ రావుతో కార్యవర్గ సభ్యులను, సలహాదారులను ఎన్నుకున్నారు. అనంతరం



ఎన్నికైన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఏకగ్రీవంగా ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి, జిల్లా నుంచి విచ్చేసిన ఎన్నికల అధికారి టీం అందరికీ జహీరాబాద్ మండల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.. తమపై నమ్మకం నుంచి అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నుకున్న కమిటీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎవరికీ ఏ సమస్యలు వచ్చినా.. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మంత్రి హరీశ్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



నవతెలంగాణ-జహీరాబాద్

మొన్నటి వరకు బీఆర్ఎస్‌లో ఉండి అన్ని విధాల లాభం పొందిన పార్టీ మాజీ మండల అధ్యక్షులు రాములు యాదవ్ మంత్రి హరీశ్‌రావు పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ మండలాధ్యక్షులు తట్టు నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రి సహకారంతో ఎంఆర్ ఎఫ్ పరిశ్రమలో అధ్యక్షుడిగా గెలుపొందిన రాములు యాదవ్ కూడా మంత్రికి బినామీయే కదా అన్నారు. బినామీల విషయమై తాము బహిరంగ చర్చకు సిద్ధం అని.. రాములు యాదవ్ స్పందించాలని డిమాండ్ చేశారు. తక్షణమే మంత్రి హరీశ్‌రావుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పార్టీ కార్యకర్తలు కూడా స్పందిసారన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మెన్ పెంటారెడ్డి, మాజీ చైర్మెన్ విజయ్ కుమార్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మాణిక్యమ్మ, పీఏసీఎస్ చైర్మెన్ మచ్చేందర్ శెట్టి, రాథోడ్, గులాబ్ సింగ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిన్నారంలో కోటి మొక్కలు నాటే కార్యక్రమం

నవతెలంగాణ-జిన్నారం

భారత స్వాతంత్ర వజ్రోత్సవాల ముగింపు ఉత్సవాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం నేడు (శనివారం) వన్ డే వన్ క్రోర్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని జిన్నారం మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు జిన్నారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ రాములు తెలి పారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎంపీ టీసీలు, ప్రజాప్రతి నిధు లు, నాయకులు, అధికారులు భాగస్వాములై పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. ఉదయం 9 గంటల నుండి కార్య క్రమాన్ని సామూహికంగా చేపట్టాలన్నారు. ఇప్పటికే గుంతలు తీయడం, మొక్కలు సమకూర్చామన్నారు. ప్రతీ గ్రామంలో కనీసం 750 మొక్కలు నాటాలన్నారు.

మాజీ సైనికులతో రెజిమెంటల్ సెంటర్ అధికారుల ముఖాముఖీ

నవతెలంగాణ-సంగారెడ్డి

మద్రాస్ రెజిమెంటల్ సెంటర్‌లో పనిచేసి రిటైర్ అయి సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలో నివసిస్తున్న మాజీ సైనికుల సమస్యలు తెలుసుకొని.. వాటిని పరిష్కరించడానికి మద్రాస్ రెజిమెంటల్ సెంటర్ నుండి అధికారులు వచ్చిన అధికారులు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మాజీ సైనికులతో ముఖాముఖి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు వారి కుటుంబ సభ్యులతో కలిసి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి యస్.సత్య శ్రీ మాజీ సైనికు లను ఉద్దేశించి.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అవ లు చేసే అనేక సంక్షేమ, మాజీ సైనికులకు లభించే రాయితీలు సౌకర్యాలు వారికి వివరి ంచారు. స్వయం ఉపాధి పతాకాలు కూడా వారు వినియోగించుకొని ఆర్థికంగా వారు అభివృద్ధి చెందడానికి పలు సూచనలు చేశారు. దేశంలోనే మొదటగా తెలంగాణ రాష్ట్ర సైనిక సంక్షే మ శాఖను పూర్తి డిజిటలైజ్ చేయడం జరిగి ంద న్నారు. రాష్ట్రంలోని ప్రతీ మాజీ సైనికుల డాటాను పూర్తిగా కంప్యూటరైజ్ చేశారన్నారు. వారికి లభించే రాయితీలన్ని ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకునే పద్ధతిని వివరించారు. మాజీ సైనికుల కుటుంబ సభ్యులతో మాట్లాడి.. వారి సమస్యలను అడిగి తెల్సుకున్నారు.

సీపీఐ(ఎం) నుంచి సందీప్ బహిష్కరణ

నవతెలంగాణ-కొండాపూర్

సీపీఐ(ఎం) విధానాలకు వ్యతిరేకంగా, పార్టీ పని పద్ధతులకు భిన్నంగా వ్యవహరిస్తున్న మాందాపూర్ గ్రామానికి చెందిన తలారి సందీప్‌ను, తలారి అర్జున్‌లను పార్టీ సభ్యత్వం నుంచి బహిష్కరించినట్టు పార్టీ సెక్రటరీ కే.రాజయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో ఏకగ్రీ వంగా నిర్ణయం జరిగిందన్నారు. ఇకమీదట సందీప్, అర్జున్‌లకు పార్టీతో ఎటువంటి సంబంధం లేదని ప్రజలు గమనించాలన్నారు.

యోగ ఆసనాలతో ఎన్నో అద్భుతాలు

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్ : యోగ ఆసనాలతో ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చని సీపీ ఎన్.శ్వేత అన్నారు. శుక్రవారం సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో పోలీస్ అధికారులకు యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి పోలీసు ఆరోగ్య రక్ష కార్యక్రమంలో భాగంగా మంత్రి హరీశ్‌రావు చొరవతో రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా సిద్దిపేట జిల్లాలో ఉన్న పోలీసులకు సిద్దిపేట మెడికల్ కళాశాల వైద్యుల సహకారంతో హెల్త్ చెకప్ చేయించడం జరిగిందన్నారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వాకింగ్, రన్నింగ్, స్విమ్మింగ్, చేయలేని వారికి వారానికి నాలుగు రోజులు, 60 రోజులపాటు సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ సెంటర్ లో యోగా ను మాస్టర్ అశోక్ తోనేర్పించడం జరుగుతుందని తెలిపారు. యోగ అద్భుతంగా పనిచేస్తుందని, యోగాతో సంపూర్ణ ఆరోగ్యవంతులు కావచ్చని క్రమం తప్పకుండా రావాలని అధికారులకు సిబ్బందికి సూచించారు. ఈ యోగా శిక్షణలో అడిషనల్ డీసీపీ శాంతిభద్రతలు యస్. మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఎస్బి ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి, త్రీ టౌన్ సిఐ భాను ప్రకాష్ పాల్గొన్నారు.

ఓటర్ నమోదును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ–కోహెడ : మండల పరిధిలోని 50 పోలింగ్ కేంద్రాలలో నేడు, రేపు నిర్వహించనున్న ఓటర్ నమోదు కార్యక్రమాన్ని అర్హులైన నూతన ఓటర్లు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ సురేఖ అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తేది అక్టోబర్ 2023 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరు నూతన ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఓటర్ నమోదు కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, నాయకులు యువతి యువకులను ప్రోత్సహించాలని కోరారు. హుస్నాబాద్ ఎన్నికల నమోదు అధికారి ఆదేశాల మేరకు సమాచారం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఇట్టి అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

మంత్రిని కలిసిన యువనేత అనూఫ్

నవతెలంగాణ– గజ్వేల్ : రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును శుక్రవారం ఆయన నివాసంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కు చెందిన బీఆర్ఎస్ యువ నేత గాడి పల్లి అనూఫ్ కలిశారు. సిద్దిపేట అసెంబ్లీ పరిధిలో ఏడవసారి మంత్రి హరీశ్‌రావు ఎన్నికల బరిలో ఉంటున్న నేపథ్యంలో కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు అనూఫ్ తెలిపారు. అదేవిధంగా లక్షకు పైగా భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. గజ్వేల్ నుండి ముఖ్యమంత్రి కేసీఆర్ మూడోసారి పోటీ చేయడంపట్ల సంతోషంగా ఉన్నదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ను లక్ష మెజార్టీతో గెలిపిస్తామని ఆయన అన్నారు. గజ్వేల్ అభివృద్ధి కేసీఆర్ తో సాధ్యమని ఆయన చెప్పారు. గజ్వేల్ అభివృద్ధిలో మంత్రి హరీష్ రావు కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు.

మద్దూరు పీఎస్‌ను సందర్శించిన సీపీ

నవతెలంగాణ మద్దూరు : మద్దూరు పోలీస్ స్టేషన్‌ను సిద్దిపేట జిల్లా సీపీ శ్వేత శుక్రవారం పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపీ సతీష్, చేర్యాల సీఐ సత్యనారాయణ రెడ్డి, ఎఎస్ఐలు జిల్లా జగదీష్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

గురుకుల కళాశాలలో 28న స్పాట్ అడ్మిషన్స్

నవతెలంగాణ–చేర్యాల

చేర్యాల పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో సిఈసి గ్రూపులో మిగిలిన ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ విభాగాలలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.అశోక్ బాబు శుక్రవారం తెలిపారు.ఆసక్తిగల విద్యార్థులు పదవ తరగతి మెమో, స్టడీ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకొని కళాశాలకు హాజరుకావాలని కోరారు.

గజ్వేల్ అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ నుంచి మరో ఇద్దరు

నవ తెలంగాణ– గజ్వేల్

పీసీసీ పిలుపుమేరకు గాంధీ భవన్‌లో అసెంబ్లీ అభ్యర్థులగా తమ పేర్లను నమోదు చేసుకునేందుకు భారీ ర్యాలీగా బయలుదేరిన ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి రాచకొండ ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కొండపాక విజయ్ కుమార్‌లు గాంధీభవన్‌లో గజ్వేల్ అసెంబ్లీ నుంచి పోటీ చేస్తామని దరఖాస్తు చేసుకున్నారు. గజ్వేల్ మండలం దిలాపూర్ గ్రామంలోని లక్ష్మీ నర్సింహాస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడ నుంచి భారీ ర్యాలీతో బయలుదేరి గజ్వేల్‌లో అంబేద్కర్ విగ్రహానికి ఆ తరువాత గజ్వేల్ దివంగత మాజీ శాసనసభ్యులు సైదయ్య దివంగత మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డి ఆ తరువాత మాజీ భారత ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు



అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత్, విజయ్‌లు మాట్లాడుతూ ఒక సామాన్య కార్యకర్త కూడా ముఖ్యమంత్రి అయ్యే అవకాశమున్నా ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యం అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రికి ఓడిపోతాననే భయం తోనే కామారెడ్డిలో కూడా పోటీ చేస్తున్నారన్నారు. ఒక విద్యార్థి నాయకుడిగా ప్రశాంత్ ఒక దళిత నాయకుడిగా విజయ్‌కి కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయం చేస్తుందని నమ్మకం ఉందన్నారు. పార్టీ అవకాశమిస్తే గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఓడించి కాంగ్రెస్ జెండాని ఎగరావేస్తామన్నారు. ఆ తరువాత భారీ ర్యాలీతో గాంధీభవన్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే గజ్వేల్ అసెంబ్లీ స్థానం నుంచి మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, పిసిసి సభ్యులు జస్వంత్ రెడ్డి, బండారు శ్రీకాంత్‌రావు దరఖాస్తులు చేసుకున్నారు.

మాలలు రాజకీయంగా ఎదగాలి



నవతెలంగాణ–మర్కుక్

అణిచివేత అధికమైతే తిరుగుబాటు తీవ్రమవు తుందని, మాలలు చదువుతోపాటుగా రాజకీయంగా కూడా ఎదగాలని జై భీమ్ మాల మహానాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు కమ్మ దారి రమేష్, గజ్వేల్ డివిజన్ అధ్యక్షులు శేఖర్ అన్నారు. గురువారం రాత్రి మండలంలోని సిఎం దత్తత గ్రామమైన ఎర్రవల్లిలో జై భీమ్ మాల మహానాడు మండల, గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మర్కుక్ మండలాధ్యక్షులుగా తుమ్మ ఐలయ్య,ఎర్రవల్లి గ్రామ కమిటీ అధ్యక్షులుగా తలారి సురేష్ ఎన్నుకుని నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాల లు రాజ్యాన్ని పాలిస్తారని భయంతో అంటరాని వారిగా ముద్ర వేశారన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మల్ల యుద్ధానికి శిక్షణ ఇచ్చిందే మాలలేనని గుర్తు చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ హక్కును కల్పించారని, ప్రతి ఒక్క అగ్రవర్ణ కులాలకు కూడా రిజర్వేషన్ కల్పించాడని ఇప్పుడున్న రాజకీయ నాయకులు పదవులు , అనుభవిస్తున్న ఎవరైనా సరే బాబాసాహెబ్ అంబేద్కర్ పెట్టిన భిక్ష అని గుర్తు చేశారు, తెలుగు పర్యాయ పదం మాల అనే కులం మల్ల అనే పదము నుండి వచ్చింది మల్ల మహా యోధుల యుద్ధంలో నాటి మల్ల నీటి వాడుక భాషలో మాలలుగా మారిందని కొనియాడారు. రాజ్యపాలన చేసే మహాయోధులుగా ఉన్న మల్ల యోధులు తరువాతి కాలములో యుద్ధంలో నష్టపోవడంతో ముస్లిం రాజులు అణిచివేసేందుకు అనేక ప్రయత్నాలు చేసి సమాజానికి దూరంగా ఉంచారన్నారు. మాలలు ఎక్కడ రాజ్యాన్ని పాలిస్తారో అని భయం వారిని వెంటాడి, మాల వారు గ్రామ రక్షక బటులుగా, కావలి, అంటరాని వారిగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు, అప్పటికి కులాలు ఏర్పడలేదు వృత్తిరీత్యా మాలలు అగ్రకులస్తులచే యుద్ధ విద్యలను బోధించేవారన్నారు.. ఈ కార్యక్రమంలో ఎర్రవల్లి ఎంపీటీసి తుమ్మ ధనలక్ష్మి కృష్ణ, వార్డు సభ్యులు సంగ నవీన్, కమిటీ ఉపాధ్యక్షులు లింగ రవి, రాజు, ప్రధాన కార్యదర్శి కర్ణాకర్, కోశాధికారి జహంగీర్, గౌరవ సలహాదారుడు బాల్ నర్సయ్య, రాజు, కార్యవర్గ సభ్యులు పోశయ్య, యాదగిరి, నర్సింలు, నరేష్, తదితరులున్నారు,

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లోకి చేరిక



మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

నవ తెలంగాణ రాయపోల్

'దుబ్బాక నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే మాటలు నీటి మూటలయ్యాయి. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం' అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాయపోల్ బీజేవైఎం మండల అధ్యక్షులు ఎంపీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గ ప్రజలు అభివృద్ధిని కాంక్షిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం ఖాయమని పేర్కొన్నారు. రాయపోల్ మండల బీజేవైఎం అధ్యక్షులు గల్వ దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో రాయపోల్, టెంకంపేట, లింగారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 50 మంది బీజేపీ కార్యకర్తలు ఎంపీ ప్రభాకర్ రెడ్డి సమక్షంలో బీజేపీ నుండి బీఆర్ఎస్ లో చేరడం జరిగింది అన్నారు. ఉప ఎన్నికల్లో విజయం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత బొక్క బోర్లా పడ్డ బీజేపీ పార్టీని దుబ్బాక ప్రజలు నమ్మడం లేదన్నారు. బీఆర్ఎస్ వస్తేనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం వొచ్చిన తర్వాతే మన దశ,దిశ మారిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ లోకి వలసల పరంపర కొనసాగుతుందన్నారు. అభివృద్ధి కోసమే బీఆర్ఎస్ లోకి సీఎం కేసీఆర్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై బీజేపీ నుండి బీఆర్ఎస్ లోకి చేరినట్లు బీజేవైఎం మండల అధ్యక్షులు గల్వ దయాకర్ రెడ్డి తెలిపారు. ఉప ఎన్నికల తర్వాత బీజేపీ పై ప్రజల్లో విశ్వాసం పోయిందన్నారు. నూతన మండలంగా రాయపోల్ ను ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోనే అభివృద్ధిలో ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ, సీనియర్ నాయకులు హస్మండ్ల రాజిరెడ్డి, ఇప్ప దయాకర్, కల్లూరి శ్రీనివాస్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ పాల రవీందర్ గౌడ్, సర్పంచ్ కరుణాకర్, స్వామి, రాజా గౌడ్, లక్ష్మారెడ్డి, మహేష్, ఎన్ రాజు, మల్లేశం పాల్గొన్నారు.

ముదిరాజులు రాజకీయంగా ఎదగాలి



మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు ముదిరాజ్
ఘనంగా కొరివి కృష్ణ స్వామి జయంతి

నవ తెలంగాణ – సిద్దిపేట

ముదిరాజులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు ముదిరాజ్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, హైదరాబాద్ మాజీ మేయర్, రచయిత, పాత్రికేయుడు, విద్యావేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, ముదిరాజ్ సంఘం స్థాపకుడు, వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి కృష్ణస్వామి 130 జయంతిని శుక్రవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ముదిరాజ్ జర్నలిస్టు సంఘం, ముదిరాజ్ మహాసభ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ కొరిమి కృష్ణస్వామి సేవలను కొనియాడారు. ముదిరాజ్ మహానాయకుల జయంతి లను అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, గౌరవ అధ్యక్షులు పరమేశ్వర్, గౌరవ సలహాదారు యాదగిరి, మీడియా సెల్ ఇంచార్జ్ బైరి సతీష్, ముదిరాజ్ నియోజకవర్గ జర్నలిస్టుల సంఘం గౌరవ అధ్యక్షులు వెంకన్న, ఉపాధ్యక్షులు వెంకట్, బాలేష్, తిరుపతి,పిట్ల శ్రీనివాస్, ముదిరాజ్ కుల సంఘాల నాయకులు ధర్మ ముదిరాజ్, తుపాకుల బాలరంగం, మిద్దె రవి, జంగిటి శ్రీనివాస్, పిట్ల రాజయ్య, రాజన్న, నర్సింలు, బైరి యాదగిరి, లక్ష్మణ్, శ్రావణ్, రాజు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదు

నవతెలంగాణ–తొగుట : రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదని మహారాష్ట్రంలోని సోలాపూర్ ఎమ్మెల్యే సుభాష్ చంద్ర దేశ్ముఖ విమర్శించారు. శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మార్కెట్ యార్డులో భారతీయ జనతా పార్టీ ప్రవస్ యోజన కార్యక్రమంలో నిర్వహించారు. ఇందులో భాగంగా బూతు కమిటీ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇన్చార్జులు, మండల, జిల్లా నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికలలో 119 నియో జకవర్గాలలో కాషాయం జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.దుబ్బాక నియో జకవర్గంలో ఎమ్మెల్యే రఘునందన్ రావు ను మళ్లీ భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని గుర్తు చేశారు.తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చి న హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదని ఆరోపించా రు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు,దళిత బంధు,దలి తులకు మూడు ఎకరా లు భూమి,బీసీ బంధు, గృహలక్ష్మి, ఉద్యోగాలు అన్నీ మర్చిపోయి ముఖ్య మంత్రి కేసీఆర్ తన బిడ్డ లిక్కర్ దందాలో ఆర్థికం గా ఎదగడానికి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాబోవు ఎన్నికలలో తెలం గాణ రాష్ట్ర ప్రజలందరూ భారతీయ జనతా పార్టీ, నరేంద్ర మోడీ దేశంలో చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందే విధంగా కృషి చేస్తున్నారని అభి ప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్ రెడ్డి,మండల అధ్యక్షులు చిక్కుడు చంద్రం,ఉపాధ్యక్షులు నంట సామిరెడ్డి, ఐలగొండ చంద్రశేఖర్ గౌడ్,ఎం శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ–దుబ్బాక

దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఈ నెల 26, 27న, సెప్టెంబరు 2, 3వ తేదీల్లో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నామని, అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా నూతన ఓటరుగా పేర్లు నమోదు చేయించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్, నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి గరిమ అగర్వాల్ శుక్రవారం తెలిపారు. ఓటర్ లిస్టుల్లో తప్పులుంటే సరిచూసుకోవాలని సూచించారు. ఆ దిశగా నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు 18 ఏళ్ళ నిండిన యువతీ యువకుల్లో చైతన్యం పెంచేలా ప్రోత్సహించాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ–చేర్యాల

చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన పాక రాములు అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి శుక్రవారం మృతునికి సంతాపం తెలిపి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అదే విధంగా పట్టణ కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ముస్త్యాల యాదగిరి తల్లి ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ముఖ్య నాయకులు ఉడుముల భాస్కర్ రెడ్డి, మంజె మల్లేశం, ఉట్లపల్లి శ్రీనివాస్, దాసరి శ్రీకాంత్, నీలం సన్నీ తదితరులు పాల్గొన్నారు.